# రాబోయే కాలంలో కాబోయే నాయకుడు

(సాంఘిక నాటకం)



894.8272
VAL

రచన

యస్.యమ్.వలి

Ci

# రాబోయేకాలంలో-
# కాబోయేనాయకుడు

(సంచలనాత్మక సాంఘి నాటకము)

For Review
Editor "Andhra prabha" Daily

రచన :
యస్. యం. వలి

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10943

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10943

పబ్లిషర్సు
ఆంధ్రరత్న బుక్ డిపో తెనాలి

ప్రథమ ముద్రణ :
జనవరి : 1973

వెల : 4-00

ముద్రణ :
శ్రీ శారదా ప్రెస్, తెనాలి-2

894.8272
VAL

ముఖచిత్రాలంకరణ : శ్రీ తులసి గోవిందరావు

ఈ పుస్తకానికి సంబంధించిన ప్రింటింగ్ అండ్ పబ్లిషింగ్ హక్కులు ఆంధ్రరత్న బుక్ డిపో, తెనాలి వారికి చెందియున్నవి. మిగిలిన సర్వహక్కులు రచయితైన నాకు చెందియున్నవి. ఈ నాటకాన్ని ప్రదర్శించేముందు ఒక కార్డు వ్రాస్తే మీతోబాటు నేను ఆనందం పంచుకుంటాను.

V. R. NARLA
D.P.R.I.
Acc. No.

---

ప్రదర్శన వివరములకు :
యస్. యం. వలి
C/o రేజేటి కనకారావు, శ్రీనివాసరావుపేట, 2 వ లైను, గుంటూరు-4

AOUA105B148



రచయిత :

## యస్. యం. వలి

జననం : 1951 జూన్ 9 గుంటూరుజిల్లా ప్రత్తిపాడు గ్రామం, శ్రీ మదార్ సాహెబ్, హుస్సేన్‌బీల ఏకైక పుత్రులు, చిన్ననాటి నుండి నాటకాలంటే అభిరుచి — చిలకలూరిపేట, గుంటూరు కళాశాలలో విద్యాభ్యాసం. రచయిత స్వయముగా మంచినటులు, అనేక పరిషత్తులలో ఉత్తమ నటనకు, దర్శకత్వానికి బహుమతులు పొందియున్నారు. అభిమాన రచయిత : శ్రీ మోదుకూరి జాన్సన్ వీరి త్వరలోరానున్న నాటకాలు : "ఊర్వశి", "నైట్‌క్లబ్", "శిక్ష", "న్యాయం నిద్రపోయింది" మొదలగునవి.

# అంకితం



ఒకప్రక్క తీరికలేని వైద్య వృత్తిలో నిమగ్నులవుతూ, మరొక ప్రక్క నిరంతరం కళాసేవచేస్తున్న నిస్వార్థ కళాహృదయులు

డా॥ శ్రీ అమంచర్ల శంకరరావు M. D., గారికి

నా యీ తొలికుసుమాన్ని అంకిత మిస్తున్నాను.

— రచయిత

# కృతజ్ఞత

ఈ నాటక రచనకు నా వెనుకనుండి నన్ను నడిపించిన మహావ్యక్తులు కొందరున్నారు. వారికి కృతజ్ఞతలు తెలియజేయటం నా కర్తవ్యం.

ఈ నాటక రచన ఆదినుండి అంతంవరకూ ఆర్థికంగా, అంతరంగికంగా నాతో సహకరించిన నా ప్రియమిత్రులు, రేజేటి రాంబాబు, రేజేటి కనకారావు సోదరులకు నా హృదయపూర్వక శతాభివందనలు తెలియజేసుకుంటున్నాను.

ఈ నాటకాన్ని మొదటిసారిగా ప్రదర్శించిన రాజా మెమోరియల్ ఆర్ట్సు సభ్యులకు, ఆ సంస్థ అధ్యక్షులు డా॥ డి. నరసింహారావుగారికి, సెక్రెటరీ- వై. ఆంజనేయులుగారికి, అడిగిన వెంటనే ముఖచిత్రాన్ని గీసియిచ్చిన శ్రీ తులసి గోవిందరావుగారికి, నాటకంలోని ప్రతిపాటకు చక్కని బాణీలు చేకూర్చిన సంగీత దర్శకులు శ్రీరాము (రాగమంజరి ఆర్కెష్ట్రా) గారికి, ప్రతిపాటను మనోరంజకంగా పాడి మెప్పించిన మధుర గాయకులు అడపా రాఘవరావు (రాగమంజరి ఆర్కెష్ట్రా) గారికి, నాటకంలోని "కసిరిందా కలిమినిమ్ను" అన్నపాటను వ్రాసియిచ్చిన నా మిత్రుడు చంద్రమోహన్‌కు అడిగినవెంటనే అభిప్రాయాన్ని వ్రాసియిచ్చిన నా గురువుగారు శ్రీ బయ్యవరపు వెంకటేశ్వరరావుగారికి శ్రీ కె. కె. రావుగారికి, శ్రీ యం. వి. సుబ్బారావుగారికి, శ్రీ చంద్రమోహన్‌కు, నాటకాన్ని సర్వాంగ సుందరంగా ముద్రించిన ఆంధ్రరత్న బుక్ డిపో, అధినేతలు శ్రీ గ్రంధి లక్ష్మయ్యశ్రేష్ఠిగారికి, నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ముఖ్యంగా అన్నివిధాల నాకు సహకరించిన మిత్రుడు శ్రీ లింగినేని కృష్ణార్జునరావు (రక్తజ్వాల ఫేం) ను మనస్ఫూర్వకముగా అభినందిస్తున్నాను.

—రచయిత

## నా ట కం గు రిం చి

ఇది నా తొలి ప్రయత్నం - చిన్ననాటినుంచి చిన్నచిన్న కథలు గేయాలు వ్రాయటం నాకు అలవాటు ఉన్నట్లుండి నాటకం వ్రాయాలని పించింది - ఎలా వ్రాయాలా అని చాలారోజులు ఆలోచించాను-నలుగురికీ ఉపయోగపడే నాటకం వ్రాయాలని ఈ నాటక ఇతివృత్తాన్ని ఎన్ను కున్నాను - పూర్తిచేసి పెద్దలకు చూపించాను. మెచ్చుకున్నవారూవున్నారు- విమర్శించినవారూవున్నారు. ఆ పెద్దల విమర్శనలను మనస్ఫూర్తిగా అంగీ కరించాను విమర్శనలకు అనుగుణంగా నాటకాన్ని తీర్చిదిద్దాను దాని ప్రతిరూపమే మీ ముందుంచుతున్నాను. ఇందులో మొదటి పాటలోని "ఇరవై ఏడెకరాలే వుండితీరులే" అన్నలైనుకు బదులు "పరిమితి ఎక రాలే వుండితీరులే" అని పాఠకులు గమనించ వలసినదిగా కోరుచున్నాను.

—ర చ యి త

భవానీ ఆర్ట్సు అసోసియేషన్ గుంటూరువారు ప్రదర్శించిన నటీనటవర్గం

| | |
|---|---|
| భూపతిరావు | — శ్రీ కె. నాగయ్య |
| రాజేష్ | — శ్రీ ఆర్. వీరయ్య |
| వీరయ్య | — శ్రీ యం యస్. ప్రభుదాస్, బి. ఏ. |
| పాపయ్య | — శ్రీ పి. వెంకటేశ్వరరావు |
| కనకయ్య | — శ్రీ పి. ఎరుకలయ్య |
| పానకాలు | — శ్రీ బి. ప్రభాకరరెడ్డి |
| గురవయ్య | — శ్రీ ఏ. రామారావు |
| యస్. ఐ. | — శ్రీ టి. రాఘవేంద్రరావు |
| విజయ | — కుమారి లక్ష్మి |

డైరెక్షన్ : శ్రీ కె. నాగయ్య

ఆర్గనైజర్ :
శ్రీ యస్. ఖాదర్

మ్యూజిక్ :
రాగమంజరి ఆర్కెష్ట్రా

## రాజా మెమోరియల్ ఆర్ట్సు గుంటూరువారు ప్రదర్శించిన నటీనటవర్గం.

| | | |
|---|---|---|
| భూపతిరావు | : | శ్రీ వై. ఆంజనేయులు |
| రాజేష్ | : | శ్రీ యస్ యం. వలి, శ్రీ ఆర్. రాంబాబు |
| వీరయ్య | : | శ్రీ యం. వెంకటేశ్వరరావు (చిన్నా) |
| పాపయ్య | : | శ్రీ అడపా రాఘవరావు, యస్ కె. హుస్సేన్ |
| కనకయ్య | : | శ్రీ ఆర్. కనకారావు, పి. నగేష్ (ఎ) |
| పానకాలు | : | శ్రీ పగడాల నాగేశ్వరరావు |
| గురవయ్య | : | శ్రీ మజ్జి వెంకటేశ్వర్లు |
| యస్. ఐ. | : | శ్రీ ఆర్. రాంబాబు |
| విజయ | : | శ్రీ కమలకుమారి, కుమారి లక్ష్మి |

దర్శకత్వం :
యస్.యం. వలి

సంగీతం :
రాము
(రాగమంజరి)

మేకప్ :
కె. వి సాంబశివరావు
సిహెచ్. రామారావు

ట్రూపు ప్రెసిడెంట్ :
డా॥ డి. నరసింహారావు, R. I. M. P.

ప్లేబాక్ :
అడపా రాఘవరావు
(రాగమంజరి)

ఆర్గనైజర్సు : రేజేటి రాంబాబు, రేజేటి కనకారావు

## మీ ముందుకొచ్చే పాత్రలు

భూ ప తి రా వు

వయస్సు 45 సంవత్సరాలు, సమితి ప్రెసిడెంటు

రా జే ష్

వయస్సు 25 సంవత్సరాలు, భూపతిరావు కుమారుడు

వీ ర య్య

వయస్సు 50 సంవత్సరాలు, కార్మికనాయకుడు

పా ప య్య

వయస్సు 40 సంవత్సరాలు, పూజారి

క న క య్య

వయస్సు 40 సంవత్సరాలు, కరణం

పా న కా లు

వయస్సు 40 సంవత్సరాలు, పెద్దభూస్వామి

గు ర వ య్య

వయస్సు 45 సంవత్సరాలు: భూపతిరావు గుమాస్తా

యస్. ఐ.


వయస్సు 30 సంవత్సరాలు

వి జ య

వయస్సు 18 సంవత్సరాలు, వీరయ్య కుమార్తె

కాలం — వర్తమానం

ఇందులోని పాత్రలూ - సన్నివేశాలు కేవలం కల్పితం, ఎవరినీ ఉద్దేశించి వ్రాసినవికావు.



ఈ నాటకాన్ని మొదటిసారిగా ప్రదర్శించిన రాజా మెమోరియల్ ఆర్ట్స్, నటీనటవర్గము

కొంతకాలంనుండి మిత్రుడు యస్. యం. వలి నటుడుగా, నాటక ప్రయోక్తగా మాత్రమే నాకు పరిచయం. అటువంటి మిత్రుడు ఒక్క-సారిగా రచయితగా అందునా అభ్యుదయ రచయితగా నా ముందు ప్రత్యక్షమైతే ఆశ్చర్యపోయాను. ఆనందంతో మాట్లాడలేకపోయాను.

మిత్రుడు శ్రీ యస్. యం. వలి వ్రాసిన "రాబోయే కాలంలో-కాబోయేనాయకుడు" నాటకం చదివాను. నాటకం మొదటినుండి చివరి వరకూ నవసమాజ నిర్మాణం అంశాలపై నడిచింది. ప్రస్తుత రాజకీయ, ఆర్థిక, నైతిక, కులమత తత్వాలకు అద్దలాంటిది ఈ నాటకం. ప్రేక్షకుల మనస్సుకు, ఆలోచనా శక్తికి కావలసిన "మేత" ఈ నాటకంలో వుంది. "తనగాధ" అని భుజాలు తడుముకొంటారు కొందరు, ఎదుటవారి జీవితగాధయని సానుభూతు చూపులు విసురుతారు మరికొందరు. ఈ నాటకము చూస్తుంన్నంత సేపు. కారణం యిందులోని ప్రతిపాత్ర మన నిత్య జీవితంలో కన్పించేవే.

యస్. యం వలి కలంలోనుండి వెలువడిన ఈ నాటకం అతని మొదటిరచన అంటే నమ్మలేము. కొన్నివందల నాటకాలను వ్రాసినంత అనుభవం యీ రచనలో కన్పిస్తుంది. పీడిత ప్రజానీకాన్ని అర్థంచేసుకోటానికి, వారి నిత్యసమస్యలను ఆకళింపు చేసుకోవటానికి, రచయిత ఎంత కృషిచేసాడో ! అందుకు నా ధన్యవాదాలు.

ఎందుకూ పనికిరాని నాటకాలు వస్తున్న యీ రోజుల్లో ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా విల్చే నాటకాన్ని వ్రాసిన శ్రీ యస్. యం. వలిని ఆశీర్వదిస్తున్నాను. నాటకంలోని 'రాజేష్'లాంటి యువకులు ఎందరో గాకపోయినా కొందరయినా నేటియువకులలో వుద్భవిస్తే రచయిత ఆశయం నెరవేరుతుంది. ఇలాగే ఎన్నోమంచి నాటకాలువ్రాసి ఆంధ్రప్రేక్షకుల హృదయాలలో చిరంకాలం వర్థిల్లాలని కోరుతూ వర్థిల్లుతాడని ఆశిస్తున్నా.

—బి య్యా వ ర పు

# రాబోయేకాలంలో కాబోయేకవి

శ్రీ యస్. యం. వలి వ్రాసిన "రాబోయేకాలంలో కాబోయే నాయకుడిని చూశాను. చివరివరకు చదివాను ఇది నాటకం అనడానికి నా మనసు అంగీకరించలేదు. కారణం ఏమిటో తెలుసా !

ప్రస్తుత పరిస్థితులలో ప్రజలు పడుచున్న యిక్కట్లను చక్కగా చిత్రించి నేడు కాకపోయినా రేపయినా సోషలిజాన్ని ఎలా స్థాపించాలో కళ్ళకు కట్టినట్లు చిత్రించిన సన్నివేశాలు చూసిన తరువాత ఇది నాటకం అనే దానికంటే నవసమాజ నిర్మాణానికి నాంది అంటే బాగుంటుందని నా ఉదేశ్యం నిజం చెప్పాలంటే యీ నాటకం చదివిన తరువాత వలిగారు యింతకుముందు ఎన్నో నాటకాలు రచించారనే అనుభూతి కలిగినది.

మొదటి నాటకం యిటు పాఠకుల్ని అటు ప్రేక్షకులను ముగ్ధుల్ని చేసిదంటే తరువాత నాటకం యింకా బాగుంటుందని నా ఉద్దేశ్యం. యీ నాటకం ద్వారా కనీసం కోటికొకరిలోనైనా చైతన్యము కలిగితే అటు రచయిత కొంతైనా సంతృప్తి చెందుతాడు. యీ కాబోయే నాయకుణ్ని చిత్రించిన యస్. యం. వలిని మనసారా మీరు ఆదరాభిమానాలతో సహకరిస్తే ముందుముందు అభివృద్ధిలోనికి వస్తారని ఆశిస్తున్నాను.

ఇట్లు,

—కె. కె. రావు

(మనసులుమారాలి)

గుంటూరు. 24-10-72

## మనసున్న మంచిమనిషి మా వలి

మేము హైస్కూల్లో చదువుకొనే రోజుల్లో నాటకాలు వేస్తూవుండే వాడు - మంచి నటుడవుతాడని ఆశిస్తూ వుండేవాడిని - అమాంతంగా రచయిత అయ్యాడు - రాబోయే కాలంలో - కాబోయే మంచికవి మా వలి. ఈ నాటకం చదువుతున్నంతసేపూ నేను పొందిన అనుభూతి అంతా-ఇంతా కాదు. మావాడి వాడి కలంనుండి ఇ.తకంటే వేడి నాటకాలు వస్తాయని, తప్పక వ్రాస్తాడని ఆశిస్తున్నాను.

—చంద్రమోహన్ చిలకలూరిపేట.

---

'రాబోయేకాలంలో కాబోయేనాయకుడు' నాటకం రచయిత శ్రీ వలి నాకు సుపరిచితుడు— ఈతని కలంనుండి - ముందు ముందు చురుకైన భావాలతో - భావగర్భితమైన పదములతో - మంచి నాటకాలు వెలువడగలవని ఆశిస్తాను.

— యం. వి. సుబ్బారావు
(డైరక్టరు)
శ్రీ జయంతి నాట్యమండలి, గుంటూరు

/

## మొదటి రంగం

# రాబోయేకాలంలో - కాబోయేనాయకుడు

(అది పట్టణంలో అందమయిన ప్రదేశం. పూలమొక్కలూ, సన్న జాజి తీగలూ అల్లుకొని వుంటాయి. అక్కడక్కడా పూలకుండీలు వుంటాయి. ఒక కుండీలో గులాబిమొక్క వుంటుంది. ఆ మొక్కకు ఒకపువ్వు వికశించి వుంటుంది. స్టేజీమధ్యలో ఒక లైటుస్థంభం వుంటుంది. దాని అడుగున అరుగులా సిమెంటుచేసి వుంటుంది. దూరంగా మేడల్లోని రంగు దీపాల కాంతులు కనుపిస్తుంటాయి. పున్నమి చంద్రుడు మబ్బుల్లోకి వెళ్ళటానికి ప్రయత్నిస్తుంటాడు. తెరలేచేసరికి విజయ – రాజేష్‌లు లైటు స్థంబానికి అడుగునవున్న సిమెంటు రౌండుపై కూర్చునివుంటారు.)

రాజే :— విజయా....

విజ :— ఉ....

రాజే :— అటుచూడు

విజ :— ఎటు !

రాజే :— అదిగో ! అటు....ఆ చిలిపిచంద్రుణ్ణిచూశావా ?

విజ :— మనల్నిచూసి వెక్కిరిస్తున్నాడు కదూ !

రాజే :— కాదు ........మనల్నిచూచి సిగ్గుపడి మబ్బుల్లో దాక్కున్నాడు....
(అంటూవెళ్ళి పూలకుండీలోవున్న గులాబిపూవుకోసి తీసికొని వస్తాడు.)
పూలు ఆడవాళ్ళకు ప్రాణం - అందులోనూ గులాబీలంటే నీకు మరీఇష్టం తీసుకో విజయా.

విజ :— వికసించిన పూవు చేతికిస్తే పరిమళం తగ్గుతుంది. స్వయంగా నీ స్వహస్తాలతోనే అలంకరించు (అని వెనుకకు తిరుగుతుంది. రాజేష్ విజయ జడలో పూవుంచుతాడు.)

రాజే :— (విజయను తనవైపుకు త్రిప్పుకొని) విజయా ఈరోజు నువ్వెంత అందంగావున్నావో తెలుసా ? (అని బుగ్గమీద చిటికవేస్తాడు.)

విజ :— పో చిలిపిదొంగ నాకు సిగ్గేస్తుంది.

రాజే :— సిగ్గులోనే చిన్నారి నీముఖం మరింత అందముగా వుంటుంది. అంత అందాన్నీ నీలోనేదాచుకుంటే ఎలా ? కొంతయినా నాకు దక్కనీ ........ (అని దగ్గరకు లాక్కుంటాడు ........ విజయ నవ్వుతూ ప్రక్కకు తప్పుకుంటుంది.... వెళ్ళి సన్నజాజితీగ ప్రక్కన నిలబడుతుంది.... రాజేష్ వెళ్ళి ఆమెను పట్టుకుంటాడు. తీగలు కదులుతాయి. విజయ సిగ్గుగా క్రింద పెదవిని కొరుకుతూ వచ్చి కళ్ళు మూసుకుంటుంది. రాజేష్ వెనుకగావచ్చి ఆమె చేతులుపట్టుకుంటాడు............ ఇద్దరూ ఆనందంగా పాట పాడుకుంటారు )

## —: పాట-1 :—

(పాట ఆగిపోయిన తరువాత ఇద్దరూ ఒకరినొకరు లోకాన్ని మరచి తన్మయత్వంలో వుంటారు....)

రాజే :— విజయా....

విజ :— రాజేష్..

రాజే :— మనకాలేజీ రోజులన్నీ తీయగా గడచిపోయాయి.

విజ :- ఆతీపి జీవితాంతం - ఇలాగే వుండిపోవాలి.

రాజే :- జన్మ జన్మలకూ ఇలాగే వుండిపోవాలి విజయా....

విజ :- ఊ....

రాజే :- నీకో విషయం చెప్పనా ?

విజ :- ఏమిటి ?

రాజే :- గత జన్మలోకూడా.........మనమిలాగే చల్లనిగాలిలో తీయని ఊహల్లో.........తేలియాడే ప్రేయసీ ప్రియులమే కదూ!

విజ :- మన ఈ అనుబంధం....ఎన్ని జన్మలదో !

రాజే :- ఆ అనుబంధాన్ని.........బంధంగా మార్చాలంటే ఏంచేయాలో తెలుసా ?

విజ :- ఏం చేయాలి ?

రాజే :- వయ్యారంగా వంగే నీమెడలో - సింగారంగావుండే - తాలిబొట్టు కట్టాలి....

విజ :- అబ్బా....ఎంతాశ !

రాజే :- ఆశ అందరికీ వుంటుంది.........హద్దులు మీరితేనే స్వార్థంగా మారుతుంది.

విజ :- మాటలు బాగానేర్చావు.

రాజే :- నేర్పింది నువ్వే ననుకుంటాను....(నవ్వుకుంటారు) విజయా.... మన రిజల్ట్సురాగానే పెండ్లికి ముహూర్తం పెట్టించేద్దా మనుకున్నాం....

విజ :- అబ్బాయిగారికి పెళ్ళంటే....అంతతొందరగావుందా ?

రాజే :- మరి నీకు లేనట్లు.

విజ :- రాజేష్....ఎంత మంచిమనసు నీది.

రాజే :- మంచిని అర్థంచేసుకోవటానికి—అంతకంటే మంచి హృదయం కావాలి విజయా.

విజ :- అది సరేగాని రాజేష్....నీతో ఒక విషయం చాలా రోజులుగా చెప్పాలనుకుంటున్నాను.

రాజే :- ఏమిటది ?

విజ :- విని సంభాళించుకునే శక్తి నీలోవుందా ?

రాజే :- నదులెన్ని ఉప్పొంగినా—సాగరం చెలియలి కట్టదాటదన్న సంగతి మర్చిపోకు.

విజ :- రాజేష్ ! చిన్నపుడు అనార్కలీ—సలీంల ప్రేమకథ చదువుకున్నాం గుర్తుందా ?

రాజే :- ఇప్పుడెందుకా చరిత్రంతా !

విజ :- కొన్ని గత చరిత్రలే - మరికొందరి నిజచరిత్రలవుతూవుంటాయి. అసలు అనార్కలి ఎవరు ?

రాజే :- తను నవ్వుతూ పాటపాడి—పదిమందిని మురిపించగల రాజనర్తకి.

విజ :- మరి సలీం ?

రాజే :- యువరాజు.

విజ :- అనార్కలీ—సలీంకు పోలికలున్నాయా ?

రాజే :- ఎక్కడాలేవు .... ఒక ప్రేమలోతప్ప. అయినా విజయా ఏమిటీ ఎలిమెంటరీస్కూలు ప్రశ్నలు.

విజ :- ఒకవేళ నేనే అనార్కలినయితే—!

రాజే :- విజయా !

విజ :- అవును రాజేష్....బంగారపు భవంతులలో పెరిగిన పసిడిబొమ్మవు మవ్వు....మట్టిలోపుట్టి మట్టిలోనే కలసిపోయే మామూలు బొమ్మనునేను.

రాజే :- ఎక్కడపుట్టినా.......ఎక్కడపెరిగినా......మట్టిలోనే కలుస్తామని మాత్రం మరచిపోకు. మట్టిలోపుట్టిన మాణిక్యానివినువ్వు.

విజ :- అని ఇంతకాలం అనుకున్నావు....కనుపించేదల్లా అందమయిన ప్రకృతే ననుకొనే మంచిమనసునీది. మోడుబోయిన జీవితంలో-బీటలువారిన బ్రతుకులో—శాంతిని పోగొట్టుకొని—కాంతికి దూరమై సమాజంలోనుండి విసరివేయబడ్డ హరిజనురాలిని నేను.

రాజే :- ఆసంగతి నాకు తెలుసు.

విజ :- అంతేకాదు రాజేష్ నాకు జన్మనిచ్చిన నాతల్లి సమాజంలో మోస పోయింది. ఒక దుర్మార్గుని ఉక్కుహస్తాల్లో నలిగిపోయింది. పాపాన్ని మూటగట్టుకొని దుర్భర జీవితంలో—గర్భంలో నన్ను మోసి—కన్నుమూసింది.

రాజే :- విజయా.

విజ :- రాజేశ్ ! ఇప్పుడు చెప్పు—ఈ అంటరానిదాన్ని ఆదరించగలవా? ఒక పాపఫలాన్ని స్వీకరించగలవా ? ప్రేమించగలవా ? పెళ్ళి చేసుకోగలవా ?

రాజే :- విజయా !

విజ :- ఎన్నటికీ నువ్వాపనిచెయ్యలేవు. నువ్వేకాదు. చూస్తూ చూస్తూ ఎవరూ ముళ్ళకంచెను ముద్దుపెట్టుకోలేరు. బురదలో నడవటానికి ప్రయత్నించనూలేరు.

రాజే :- విజయా ! నన్ను ఇంత తేలిగ్గా ఊహిస్తావనుకోలేదు. నేను ప్రేమించింది నీమనసును. అంతేగాని. నీగతాన్నీకాదు— కులాన్నీకాదు.

విజ :- రాజేష్.

రాజే :- మనం చదువుకున్నాం.........కాస్తోకూస్తో సంస్కృతి నర్థంచేసు కున్నాం. ఒక నూతన సమాజాన్ని స్థాపించటానికి పాటుపడాలి. సోషలిజంవైపు పరుగెడుతున్న మనదేశాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలి. రాబోయేకాలానికి గట్టి పునాదులు నిర్మించు కోవాలి.

విజ :- రాజేష్ నువ్వు ఆగర్భ శ్రీమంతుడివి కోరితే కోటీశ్వరులే నీముందు వాలుతారు. మీనాన్నగారి పట్టుదల నీకుతెలుసు.

రాజే :- మనపెండ్లికి అంగీకరించరనికూడా తెలుసు.

విజ :- తెలిసే ఈ సుడిగుండంలో చిక్కుకుంటున్నావన్నమాట. అంధ కారంలోవుండేనన్ను వెలుతుర్లోకి తేవాలని ప్రయత్నించి దీపాన్నే పోగొట్టుకోకు రాజేష్.

రాజే :- తారుమారుగావున్న నీజీవితాన్ని — సక్రమమైన మార్గంలో నడిపించి — వేలెట్టిచూపించిన ఈ సంఘంలోనే ఉన్నత స్థానం కల్పించి — మహోన్నత శిఖరాలపై నిన్ను నిలబెడతాను, నామాట నమ్ము విజయా !

విజ :- రాజేష్ నీమాటమీద నాకు నమ్మకముంది. కాని ఆడదాన్ని అందులోనూ అబలను. తెలిసీ తెలియని వయసులోనే మన మనసులుకలిశాయి. వెనుదిరిగిచూచేసరికి మన హృదయాలనిండా ప్రేమనిండిపోయింది. మన మనసులలాగే-బ్రతుకులూ కలవాలి,

దీనికే మాత్రం భిన్నంగా జరిగినా నీవిజయను మరచిపోవలసి వస్తుంది.

రాజే :- విజయా ... అంతమాటనకు. మనుష్యులకు భయపడి—మనసును దూరం చేసుకోవటం నాతరంకాదు. విజయా! ఇందులో నాస్వార్థం కూడా లేకపోలేదు.

విజ :- స్వార్థమా ?

రాజే :- అవును విజయా ! పుట్టింది బూర్జువాతత్వాలలోనయినా........ పెరిగింది సమసమాజాన్నాశించే వాతావరణంలో... ....అర్థం చేసుకున్నది సోషలిజభావాలను. నేనాశించేది నవ సమాజ నిర్మాణాన్ని. . .నా ఆశయాలు అమలు జరగాలంటే మొదటి మెట్టుగా నిన్ను నాభార్యగా స్వీకరించాలి.

విజ :- రాజేష్.

రాజే :- అవును విజయా. . .మెరకలను త్రవ్వి పల్లానికి వేయటమే సోషలిజం. . .నేను కోరేదీ—మన నాయకులు ఆశించేది అదే. అదే నాజీవితలక్ష్యం. నా లక్ష్యసాధనకోసం మా నాన్ననేకాదు. సంఘానికే ఎదురీదటానికి నిర్ణయించుకొన్నాను.

విజ :- రాజేష్ నీమనసు నర్థంచేసుకోలేకపోయాను ఒకింతసేపు నీలో తుఫాను లేవదీశాను. రాజేష్ . . . రాబోయేకాలానికి నీలాంటి నాయకుడు చాలా అవసరం.

రాజే :- విజయా. . .మరుభూమిలో మందారాలు మొలిచాయి. మనసులో మల్లెలు వికసించాయి. ఇది మనమిద్దరం తెలుసుకునేసరికి ఇంత కాలంపట్టింది. . . . .నాకు కావలసింది—నేనుకోరేదీ—నువ్వే విజయా.

విజ :- నేను చాలా అదృష్టవంతురాల్ని రాజేష్ . . .(దగ్గర కొస్తుంది.)

రాజే :- విజయా . . . (చేతిలో చెయ్యివేసి) బాసచేసి మాటతప్పటం ఇప్పటి వరకూ నేనెరుగను. కలిమికసిరినా—విధి విసరినా—నిన్ను నాదాన్నిగా చేసుకొని తీరుతాను.

(ఇద్దరూ ఆనందంగా పాట పాడుకుంటువుంటారు. మెల్లగా లైట్లు ఆరిపోతాయి)

—o—

తెర :

## రెండవ రంగం

(అది అధునాతనంగా అలంకరింపబడిన భూపతిరావు బంగళా. కుడిప్రక్క వాకిలి ఏడమప్రక్క వాకిలి వుంటాయి. మధ్య ద్వారం వుంటుంది టేబుల్‌మీద రేడియో అమర్చి వుంటుంది హాలుమధ్య ఒకటీపాయి. నాలుగు కుర్చీలు వుంటాయి. తెరలేచేసరికే రేడియో ఆన్ చేసివుంటుంది. రేడియోలోనుండి పాట వినిపిస్తుంటుంది.

పాట

రాబోయేకాలంలో—కాబోయేనాయకుడా
స్వార్థాన్ని వీడరా—సత్యాన్ని చాటరా
మంచిని పెంచరా—ధర్మాన్ని నిలపరా
భూమిని దున్నరా—పైరును కోయరా ॥రా॥

అక్రమాలు జరుగవులే
అన్యాయాలుండవులే
బంజరులుండవు
తిండికి కరువుండదు.

రైతూ - కూలీ ఒకటిగ మారినరోజు
నవసమాజ నిర్మాణం జరుగును ఆనాడు
దున్నేవాడిదె భూమిగ మారితీరులే
ఇరవై ఏడెకరాలేవుండి తీరులే.

(పాటపూర్తికాగానే గురవయ్య లోపలనుండివచ్చి క్రిందపడివున్న పేపరు తీసుకుంటాడు. రేడియో ఆపివేస్తాడు)

గురవయ్య -; రాజభరణాలు రద్దుచేస్తూ - రాష్ట్రపతి ఆమోదముద్ర - పంచాయితీ సమితులను జిల్లాపరిషత్తులను నిలుపుదలచేస్తూ త్వరలో గవర్నరు ఆర్డినెన్సు - భూకమతాలకు గరిష్ఠ పరిమితి వీలయినంతత్వరలో అమలు జరిపించుటకు మహా సభల్లో ముఖ్యమంత్రిగారి వాగ్దానం (పేపరు టీపాయిమీద వేసి) బాగానేవున్నాయి. పేపరు పైపేజిమొదలు అయి పోయిందాకా ఈ గవర్నమెంటువారి దండకం తప్ప మరేమీ కనిపించటంలేదు. కిలోబియ్యం రూపాయిన్నరకు తగ్గించకపోయినా ఇలాంటి వాగ్దానాలకు మాత్రము కొదువలేదు.

భూపతిరావు ;- ( మధ్యవాకిలిగుండావచ్చి ) ప్రొద్దున్నే ఎవరివయ్యా వాగ్ధానాలంటున్నావు ?

గుర :- ఇంకెవరివయ్యగారూ ! మన ప్రజానాయకులవి. మాటలుచూస్తే కోటలు దాటుతున్నాయి. చేతలుమాత్రం సూన్యంగావున్నాయి పాతగ్రామఫోను రికార్డులాగ. ఇదిగో ఈ పేపరు చదివారా ? (ఇస్తాడు)

భూప :- (పేపరు చదివి) గురవయ్యా ! ఈరాతలు చూస్తుంటే కొంప మునిగే లాగుందయ్యా !

గుర :- ఎన్నికొంపలు మునిగినా మనకేమయ్యగారూ ! మనమేడ ఊరంతటికీ ఎత్తులోవుందిగా !

భూప :- అది వరదొస్తే సంగతి కానీ ఈ ఉరవడికి ముందుమునిగేది మన మేడే గురవయ్యా !

గుర :- అయితే చాలా ఎత్తైన గట్లేవెయ్యాలయ్యగారూ !

భూప :- గట్లువెయ్యటమేగాదు. మెట్లుకూడా పెట్టించాలి. అదిసరేగాని ఆ ఇన్‌కంటాక్సు ఆఫీసరు సంగతి ఏంచేశావు ?

గుర :- ఎంతచెప్పినా వినటంలేదండీ.

భూప :_ వినటంలేదని గోళ్ళుగిల్లుకుంటూ కూర్చుంటేసరి పోతుందటయ్యా వినేటట్లుచెయ్యాలి, దానికి అనేకమార్గాలున్నాయి. కాస్తబరువు పెట్టలేకపోయావా ?

గుర :- అతను బరువుకు తూగేరకంకాదు.

భూప :- అయితే అపర కృష్ణుడన్నమాట నేరుగా గోపికనే పంపిస్తే సరిపోతుందిగా ! మధువుకు మగువకు లొంగని ఆఫీసరంటూ వుంటాడా ? అదంతా నేచూసుకుంటాలే. ఆ పానకాలుకు కబురుచేశావా ?

గుర :- స్వయంగా నేనేవెళ్ళానయ్యా ! ఆయనగారి పెద్దమ్మాయి పెళ్ళి విషయంలో హడావుడిగావున్నాడు. వెంటనే వచ్చేస్తానని చెప్పాడు.

భూప :- సరే ...ముందా కరణంగారి దగ్గరకెళ్లి, మన పొలాల లెక్కలన్నీ వెంటనే చూడమను. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. ఈ ప్రభుత్వం ఆర్డినెన్సు జారీచేసేలోగానే మనం మనపనులన్నీ గప్ – చిప్‌గామాపుచేసి వట్టిచేతులు చూపించాలి అర్థమయిందా ?

గుర :- అర్థమయిందా అవి నన్నుమీరు అడగాలటండీ ఇరవై సంవత్సరాల నుండి తమదగ్గర గుమస్తాగా పనిచేస్తున్నాను. ఆమాత్రం అర్థం చేసుకోలేకపోతే ఈ గురవయ్య గుమస్తా గురయ్యేకాదు. (బయటకుచూసి) అదిగో మాటల్లోనే వచ్చేశారు పానకాలుగారు.

పాన :- నమస్కారమండీ ! ఏదో అర్జంటుగా కబురుపంపారు.

భూప :- అర్జంటుగాకాక. ఆరనరీగా కబురుపంపిస్తే ఇంతత్వరగా వస్తావా నువ్వు. అయినా ఈమధ్య పెళ్ళిసందడిలో వున్నావనుకుంటాను.

పాన :- ఏంపెళ్ళో ఏమో ! పెళ్ళయితే సులభంగానే జరిగిందికాని విడాకు లంత సులభంగారావటంలేదు భూపతిరావుగారూ.

భూప :- పెళ్ళిచేసివారంకాలేదు. అప్పుడే విడాకులంటా వేమిటయ్యా! పురిట్లో తద్దినలా.

పాన :- మరేంచెయ్యమంటారు గుండెలమీద కుంపటిలావచ్చి కూర్చున్నాయిగా ఈ దిక్కుమాలిన భూసంస్కరణలు విడాకులిప్పిస్తే వాళ్ళదన్నా చెరోకుటుంబం అవుతుందేమోనని నాతాపత్రయం.

భూప :- ఆరినీ మొత్తానికి గట్టిపిండానిపే కుక్కలకూ పిల్లులకూ వ్రాయకుండా తెలివైన పనిచేస్తున్నావ్ !

పాన :- ఎంతయినా మీముందు మేమెంత ! ఎలాగయినా ఈ గండం గట్టెక్కే ఉపాయమేదైనా చూడండి భూపతిరావుగారూ !

భూప :- అందుకేనయ్యా నిన్ను పిలిపించింది. మాటల్లో మరిచేపోయాను. గురవయ్యా.

గుర :- అయ్యా !

భూప :- అబ్బాయి ఈ రోజే మెయిల్‌లో వస్తున్నట్లు వుత్తరం వ్రాశాడు. వెళ్ళి అఏర్పాట్లన్నీచూడు.

గుర :- ఈరోజుల్లో నిన్నటి రైలు ఈరోజు వస్తుందిమరి. అబ్బాయి గారు ఇవాళ వస్తారంటారా ?

పాన :- రైళ్ళంటే గుర్తొచ్చింది. అసలు బయలుదేరిన రైలు రెండవ స్టేషనుకు చేరటంలేదు. మరీ ఈసమ్మెలు బయలుదేరాక ఏలైనులో పట్టాలున్నాయో లేవో చెప్పటం ఆ రైల్వేమంత్రి గారికే కష్టంగావుంది.

భూప :- శుభమా అని అబ్బాయి పరీక్షలు వ్రాసివస్తుంటే ఈ అపశకునా లేమిటయ్యా ముందు నువ్వు స్టేషనుకెళ్ళవయ్యా !

గుర :— చిన్నకారు తీసుకెళ్ళమంటారా ? పెద్దకారు తీసుకెళ్ళమంటారా ?

భూప :- పెద్దకారె తీసుకెళ్ళు. కాస్తమెల్లిగా నడపమను మనరోడ్లలో. అబ్బాయికి నడుమునొప్పి వచ్చినా రావచ్చు.

గుర :- అలాగేనండి....(బయటకు వెళతాడు)

భూప :- చూడు పానకాలు ఇప్పుడు నిన్ను ఎందుకు పిలిపించానంటావు,

పాన :- ఆమాత్రం అర్థంచేసుకోలేనా ? అబ్బాయిగారు వస్తున్నారుగదా పార్టీకి అన్ని ఏర్పాట్లు చేయించమని చెప్పటానికి.

భూప :- ఎప్పుడూ పార్టీలూ సంతాపాలు తప్ప మరే ఆలోచన వుండదు నీకు. చెప్తానువిను గ్రద్దనుచూడగానే కోడి తనపిల్లల్ని జాగ్రత్త చేసుకుంటుంది.

పాన :- అంటే ?

భూప :- ప్రభుత్వం మనభూముల్ని స్వాధీన పరచుకొనేముందే అంది నంతవరకు గుట్టుచప్పుడు కాకుండా అన్యాక్రాంతం చేసెయ్యటమే !

పాన :- అదెలా సాధ్యమవుతుంది. రిజిస్ట్రేషన్లు ఆపేశారుగా !

భూప :- అందుకేగా మరి ఈ తతంగమంతా అయినా నువ్వువట్టి అమాయకుడివి ఈ పరగణాలోకెల్ల పెద్ద భూస్వామిని నేనేగదా ! నా పదిహేను వందల ఎకరాలు అన్యాయంగా చూస్తూ — చూస్తూ ఎవరికో ధారాదత్తం ఎలాచెయ్యగలను అందుకే దీనికి మంచి ప్లాను తయారుచేశాను.

పాన :- అంతకంటే కావలసినదేముందండీ.

భూప :- చెప్తానువిను. మన ఊళ్లో నూటికి ఎనభై వంతులు పేదవాళున్నారు. వాళ్ళకా భూములులేవు. మనకీభూములా దక్కవు. అందుకని మనమేవాళ్ళకు బాకీవున్నట్లు చిన్ననాటకమాడాలి. ఈ సంస్కరణలు అయిపోగానే నోట్లూవుండవు. బాకీవుండదు. అంతేకాదు బ్యాంకులన్నీనీ చేతిలోవున్నాయి. ఇక చిన్నరైతులకు అప్పులు పుట్టాయంటే మనమాట వినరు. అందుకని ఏదో చిన్న సాకుచెప్పి బ్యాంకులన్ని మూసేయించు. అప్పుడు భూములన్నీ బీడులవుతాయి... కరువస్తుంది....జనమంతా మనసీడకే చేరుకుంటారు....చెప్పినట్లువింటారు....ఎలావుంది ?

పాన :- బ్రహ్మాండంగావుంది భూపతిరావుగారూ ! మీదివట్టి బుర్రకాదు. బంగారపు బుర్ర. మీఆలోచనలన్నీ బంగారమే. మీలాంటి పెద్దలు ఏదిచెప్తె అది చెయ్యటానికే మేమున్నాం. సమితి ప్రెసిడెంటులు మీకు ఎదురుచెప్పేధైర్యం ఎవరికుంటుందిలెండి.

భూప :- అక్కడే చిన్నచిక్కు వచ్చిపడింది. ఇదిగో ఈ పేపరుచూడు. మూలిగేనక్కమీద తాటికాయపడ్డట్టు ఈ సమయంలోనే పంచాయితీ సమితులను రద్దుచేస్తున్నారు. ఇక నాడిగ్రీఏముంటుంది. కథఅడ్డం తిరిగింది. మనతెలివితేటలన్నీ ఉపయోగించి మరీ ఈపని సాధించాలి.

పాన :- భూపతిరావుగారూ ? మనం ఈ ప్రయత్నం వీలయినంత త్వరలో ముగించాలి.

భూప :- అందుకే వీరయ్యను పిలిపిస్తున్నాను.

పాన :- వీరయ్యనా !

భూప :- అవును వీరయ్యనే ! వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలి. ఆ అలగా జనానికంతటికీ దేవుడు వీరయ్య. వాడేంచెయ్యమంటే అదిచేస్తారు వాళ్ళంతా. అందుకే ముందుగా వీరయ్యను మన పంజరంలో చిక్కించుకోవాలి.

పాన :- వీరయ్య మనమాట వింటాడంటారా ?

భూప :- వినక ఏంచేస్తాడు. తనకూతురు చదువుకోసంవుంటున్న ఇల్లు, పండిస్తున్నభూమిని నాదగ్గర తాకట్టుపెట్టాడు. మాటలతో వింటాడాసరి.... లేదా....

పాన :- ఇల్లు ఖాళీచేయించి ఊరుదాటిస్తాం. (ఇద్దరూనవ్వుకుంటారు.)

(పూజారి పాపయ్య ప్రవేశం మనిషి వాలకంచూస్తే హడావిడిగా పరుగెత్తుకొచ్చినట్లు వుంటుంది.)

పాప :- (ప్రవేశిస్తూ) భూపతిరావుగారూ భూపతిరావుగారూ !

పాన :- ఏమిటి పాపయ్యగారూ హడావిడిగావున్నారు ?

పాప :- హడావిడికాక మరేమిటండీ.... ఇక బ్రతుకే హడావిడి.

భూప :- ఏమిటయ్యా అలా కొంపలంటుకుపోయినట్లు కంగారు పడుతున్నావు ?

పాప :- కొంపలంటుకుంటే ఊళ్ళోవాళ్ళసొమ్ము పోతుందిగదా అవి ఊరుకొందును.

పాన :- అదేమిటి !

పాప :- మరి మాఇంట్లోవున్నది ఊళ్ళోవాళ్ళ తాకట్టుసొమ్మేకదండి.... ఇది అంతటితో ఆగుతుందంటారా ! మీరు—నేను—పానకాలు గారు ఆఖరికి మనజాతంతా మాడిపోవలసిందేగదండీ.

పాన :- ఇంతకూ అసలు విషయమేమిటి ?

పాప :- వస్తున్నా వస్తున్నా అలా దారమ్మట వస్తున్నానా ! ఎటు—మన నాంచారమ్మ కొట్టుదగ్గరనుండి వస్తున్నా ? చటుక్కున ఆశరగోపంగాడికిళ్ళీ కొట్టుదగ్గరకెళ్ళి పేపరు పట్టుకున్నానో లేదోకరంటు షాకుతగిలినట్లు తాటికాయంత అక్షరాలతో కనుపించాయండి.

భూప :— ఏమిటి ?

పాప :— ఇంకేమిటండీ ........ మిగులుగావున్న భూములన్నీ ప్రభుత్వాని కప్పజెప్పాలంట లేకపోతే బలవంతంగానైనా తీసుకుంటారట ఇది ఏమైనా న్యాయంగావుందా నాకుమాత్రం చాలాకష్టంగావుంది.

పాన :— ఒక్క భూసంస్కరణలేకాదు. పట్టణ ఆస్తులను సైతము పరిమితి చేస్తారట.

పాప :— ఇదీపెట్టారూ ! ఇక్కడపోయినా అక్కడయినా మిగులుతుందేమో నని ఆశపడ్డా ఇది నాఒక్కడికీ వచ్చిన వమస్యటండీ అపత్ బాంధవుడైన ఆ శ్రీరామచంద్రమూర్తికే వచ్చిందంఢీ. దేవుడు సొమ్ము తిన్నవాడు బాగుపడతాడటండీ హారతి కర్పూరంలా హరించుకుపోడూ.

పాన :— మధ్య నీసొమ్మేమిటి ? దేవుడి సొమ్మేమిటి ?

పాప :— ఏముందండీ తరతరాలుగా ఆ శ్రీరామచంద్రమూర్తి పేరనవున్న వెయ్యెకరాలూ మాచేతనే చేయించుకుంటున్నాడా ? ఈ మధ్యన ఆయన పేరునఉంటే ఒకటి నాపేరునఉంటే ఒకటా అని మన భూపతిరావుగారిని పట్టుకొని నా పేరుమీదే పట్టాతెచ్చుకున్నాను గదండీ. ఈనాడు భూసంస్కరణలనీ గరిష్ఠ పరిమితులనీ ఆకాస్తా కాజేసినన్నూ—నా దేవుణ్ణి దరిద్రుణ్ణిచేస్తుంటే ఎలాచూస్తూ ఊరుకో మంటారు ?

పాన :— ఇది ఆలోచించవలసిన విషయమే భూపతిరావుగారూ !

పాప :— ఇంకా ఆలోచన ఏమిటండీ మనగ్రూపు నాయకులందర్నీ పిలిపించి గట్టి తీర్మానం జరిపించాల్సిందే అవిశ్వాస తీర్మానం అదే ఆఅవిశ్వాస తీర్మానం పెట్టించి దీన్ని వెంటనే రద్దు చేయించాలి. నా శ్రీరామచంద్రమూర్తి పస్తులుంటుంటే ఎలా ఊరుకోమంటారు.

పాన :— పస్తులేమిటండీ.

పాప :— పస్తులుగాక పరమాన్నం ఎక్కడనుండి వస్తుందండీ వున్నదంతా ఎగరేసుకుపోతేనై వేచ్యాలూ. వ్రతాలూ, పూజలూ. పురుషార్థాలు ఎలా చెల్లించుకోవాలి. ఇలాంటి చిల్లరపనులు చేయటానికే

గదండీ. ఆ మాన్యమంతా నా పేర పెట్టుకున్నది. నా శ్రీరామ చంద్రమూర్తి కాలంలో ఇలాంటివన్నీ జరిగాయటండీ "రామ రాజ్యం" "రామరాజ్యం" అని పొగిడేవారు. ఈనాడు 'క్షామ రాజ్యం" అని తిట్టిపోస్తున్నారు. నాలాంటి పుణ్యాత్ముడి సొమ్ము కాజేయాలను కోవటం పాపం గదటండీ। వాళ్ళనా దేవుడు తప్పక శపిస్తాడు.

పాన :- అయినా ఇన్ని బ్లాక్‌మార్కెట్లు జరుగుతుండగా ఈ భూములే దొరికాయా ప్రభుత్వానికి.

పాప :- ఈఏడు ఆ శ్మశానాల ప్రక్కనవున్న వంద ఎకరాలు అమ్మి మా పెద్దబ్బాయి పేరన ఒక రైస్‌మిల్లు, చిన్నమ్మాయిపెళ్ళి ముగించేద్దామనుకున్నాను. హఠాత్తుగా వచ్చిపడ్డాయి ఈ ప్రకటనలు. అయినా మీ దగ్గర దాపరికమెందుకుగాని నారాముడే కలలో కనుపించి ఈపని చేయమని పురమాయించాడు. ఇక ఆయన మాటకు తిరుగుంటుందంటారా భూపతిరావుగారూ ? ఈ గండం గట్టెక్కే ఉపాయమేదైనా ఆలోచించండి.

పాన :- మనలాంటి మంచివాళ్ళకోసమే భూపతిరావుగారు చక్కని పథకాన్ని తయారుచేశారు. మన జాతంతా వారి అభిప్రాయాన్ని బలపర్చాలి.

పాప :- అయ్యో అంతకంటేనా ?

భూప :- మన అందరి మంచికోసమే నేపీప్లాను తయారుచేశాను.

పాన :- ఇక మీరేమీ సందేహించకండి. మేమున్నాం.

పాప :- అసలింతకూ ఆప్లానేమిటి పానకాలుగారూ ?

పాన :- (పానకాలు పూజారి పాపయ్య చెవిలో చెపుతాడు)

పాప :- అద్భుతంగావుంది. దీన్ని ఆబ్రహ్మదేవుడుకూడా కనిపెట్టలేడు. ఇంతపెద్ద ఆలోచనలుండబట్టే గాదండీ సమితి ప్రెసిడెంటు లయ్యారు. (కరణం కనకయ్య ప్రవేశం చేతిలో చిట్టా కాగితా లుంటాయి )

కన :- ఊళ్ళో పెద్దలంతా ఇక్కడేవున్నారే.

పాన :- ఎవరూ ! కరణంగారా ?

భూప ;- మనలెక్కలన్నీ చూసుకొచ్చారా ?

కన :- చూడటమేకాదు. చంకలోపెట్టి మోసుకొచ్చానండీ.

పాన :- అసలీ భూసంస్కరణలున్నాయిచూశారూ....

కన :- ఆవిషయం విన్నవించుకుందామనే వచ్చాను. అసలు కరణం అంటే ఎవరు ?

పాప -; కాకుల్లెక్క వ్రాసేవాడు.

కన :- నీలా దేవుడి మాన్యమంతాకాజేసి వట్టిచేతులు చూపేరకం అనుకున్నావా ? కరణం అంటే ఊళ్ళోవున్న బంజర్లన్నిటికీ వారసుడు. ఏమంటారు.

భూప :- కాదవి మేమన్నా ఊరుకుంటావా నువ్వు.

కన :- బాగాచెప్పారు. అలా మాతాతముత్తాతలదగ్గరనుండి సంక్రమిస్తున్న ఆస్తుల్నీ, పదవుల్నీ అపహరించాలని చూస్తుంటే కుదురుతుందంటారా ?

భూప :- ఎలాకుదురుతుంది.

పాన :- అందుకు ఏం చెయ్యదలిచారు. ఊరంతటికీ కరణంగారు ఏదో చక్కటి ఆలోచనే తట్టిస్తుంటుంది

కన :- నాఆలోచన నాలోనేవుంటే దానికి పాలీషేముంటుంది. అందుకు మీ అందరి సహకారం....

పాప :- అవసరమంటారు. దానికి మేం సిద్ధమే !

భూప :- ఇంతకూ ఏమిటది ?

కన :- ముఖ్యంగా దీనిని అమలు జరపవలసింది మీరు. మీ పలుకుబడి ఉపయోగించి మరీ ఈ వ్యవహారం చక్కబెట్టాలి. ఈ భూసంస్కరణలు వస్తున్నాయా.

పాప :- వస్తున్నాయనేగదండీ మాబాధ....

కన :- అందుకే మన ఆస్తిపాస్తులన్నీ మననుండి దూరం కాకుండా వుండాలంటే ఒకటేదారి.

భూప :- గోదారి....విషయం చెప్పమంటే ఉపోద్ఘాతం చెపుతావేమయ్యా.

కన :- వస్తున్నా....మనం ఇప్పుడు రైతులం.

పాప :— పైగా ఇదొకటా ! నేనుమాత్రం పూజారినే.

కన :- ఆమాటకొస్తే నేను కరణాన్నే గదటయ్యా.

పాన :— కాదని మనఊళ్ళో ఎవరంటార్లెండి.

కన :- ఇకమీదట నేను కరణాన్నికాదు. మీరు రైతులూకాదు. పాపయ్యగారు అసలు పూజారేకాదు.

పాప :— అమ్మో....దీనికి మాత్రం నేనొప్పుకోను. పైగా రాబోయేది కార్తీకమాసం.

కన :- మీకాభయమక్కర్లేదు. ఇకమీదట మనం పారిశ్రామిక వేత్తలుగా మారాలి. ఒక్కొక్క భారీపరిశ్రమకు వందల ఎకరాలు మినహాయిస్తారట ! ఇకమీదట మనమంతా బిజినెస్ మాన్స్‌గా మారాలి.

పాప :— నీనోట్లో నిమ్మరసంపొయ్యా ఎంతబాగా చెప్పావయ్యా.

పాప :— అమాంతంగా మారాలంటే ఎలా ?

కన :- అక్కడేవుంది చిన్నచిక్కు ! మన భూపతిరావుగారికి అధికార వర్గంలో మంచిపలుకుబడివుంది. రేపోమాపో మంత్రిపదవి రాబోతోంది. మీరు తలుసుకుంటే ఇదేమంత పెద్దపనికాదు.

భూప :- ఇంతకూ లైసెన్సులు కావాలంటారు ? అంతేనా ?

కన :— అంతేకాదు. ఎవరెవరికి ఎలాంటి వ్యాపారాలు బావుంటాయో మీరే నిర్ణయించాలి.

భూప :- ఇంతగా చెపుతుండగా ఎలాకాదనగలను నాకు చాలా కాలంగా పంచదార మిల్లు కట్టించాలని కోరికగావుంది.

పాప :— దివ్యంగావుంది కార్తీక మాసంలో చక్కెరపొంగలిలా ! ఆమాటకొస్తే నాకూ నూలుమిల్లు కట్టించాలనే చిరకాలవాంఛ — ఏమంటారు.

పాన :— నేను మాత్రం పొగాకు కంపెనీ పెట్టుకుంటాను.

కన :- ఇంతమంది చెప్పిన తరువాత నేనూరుకుంటానా—గుంటూరుకు— బెజవాడకు మధ్యన జనపనారమిల్లు కట్టిస్తాను

భూప :- కరణం అంటే ఏమిటో అనుకున్నాను.

పాన :- చిక్కు ప్రశ్నను చిటికలో తేల్చేశారు.

పాప :- అందుకే పుడితే కరణంగానైనా పుట్టాలి — లేదా మంత్రిగారికి పి. ఏ. గానైనా పుట్టాలి.

కన :- ఇందులో నాగొప్పేముంది. సలహాలు చెప్పటంవరకే. సారథ్యం వహించవలసింది భూపతిరావుగారే.

పాప :- అయ్యో ! ఆమాత్రం చెప్పాలా ? అసలు భూపతిరావుగారు సమితి ప్రెసిడెంటు అయ్యిందే మనకోసం కదటండీ.

పాన :- మీరు తలుచుకుంటే జరగనిదిలేదు. నన్ను మర్డర్ కేసులోనుండి తప్పించటానికి మీరెంత కష్టపడ్డారో తెలియదంటారా ?

కన :- మా పెద్దబ్బాయికి మెడికల్‌కాలేజీలో సీటురావటానికి మీరు మంత్రిగారిని పట్టుకొని చేసిన సహాయం మర్చిపోయాననుకున్నారా ?

పాప :- నాసిటీబస్సు రూటు విషయంలో మీరెంతమందిచేత చెప్పించారో నాకు గుర్తు లేదనుకున్నారా ?

పాన :- లాభంలేదు. ఈ ఒక్కసారీ మీరు గట్టిగా ప్రయత్నించకపోతే మేం బ్రతకలేం....

పాప :- కరణంగారూ ! నాకో చిన్న అనుమానం.

కర :- నీకూ్కడా అనుమానమా ?

పాప :- ఏముంది నాకు పన్నెండుమంది సంతానం గదా ! ఏలెక్కలో చూచినా ఆరు వందల ఎకరాలన్నా మిగులుతామోనని ఆశ.

కన :- మరీఫ్యామిలీ ప్లానింగ్‌నుకూడా లెక్కచెయ్యకుండా అంతమందినెలా కన్నావయ్యా !

పాప :- కన్నాను కనుకనే అనుభవించుబోతున్నాను.

పాన :- ఆలెక్కకొస్తే నా ఇద్దరు పెళ్ళాలకు కలిపి పద్నాలుగుమంది సంతానం ఎలా చూసినా నీకంటే వందెకరాలు ఎక్కువే.

భూప :– అయితే ఒక్క కొడుకేవున్న నాకేమీ దక్క కూడదనా మీ అభిప్రాయం.

పాప :— ఎంతమాట సమితి ప్రెసిడెంటుకాబట్టి మీ అబ్బాయిగారికి వెయ్యేకరాలుండొచ్చు.

పాన :— రత్నంలాంటి మాటన్నారు

కన :- అయినా పాపయ్యగారూ ! పిల్లల్నిబట్టి భూమి పంచుతున్నారటండీ. ముగ్గురికంటె ఎక్కువవుంటే నోరు మెదపకుండా పడివుండాల్సిందేనట.

పాన ;- మిగిలినవాళ్ళ సంగతి.

కర :- మేజర్లయితే పరవాలేదు. మైనర్లయితే వాళ్ళఖర్మ.

పాన :- కరణంగారూ ! మొదటినుండి కుటుంబనియంత్రణ అవలంభిస్తే ఈ చిక్కువుండేదికాదు.

పాప ;- ఇదినాకేం బావుండలేదండీ.

కర :- బావున్నా బావుండకపోయినా అది శాసనం.

పాప :- ఏ శాసనమైనా చెల్లుతుందటండీ. పుట్టబోయేవాళ్ళకు ఆపరేషన్ చేసి ఆపుతున్నారు. పుట్టినవాళ్ళకయినా పట్టెడన్నం పెట్టాలా ? వద్దా ?

పాన :- దీన్నికాస్త హైదరాబాదుకు పంపించే ఏర్పాట్లుచెయ్యండి.

పాప :- కాస్త సర్దుబాటు జరిగేటట్లుచూడండి.

కర ;- ఇంకేం కుదరదండీ ! చట్టం తయారయ్యింది. ఇక మనప్లానే శరణ్యం....

(రాజేష్ వస్తాడు. వెనుక గురవయ్య బెడ్డింగుమోసుకొని వస్తాడు)

పాప ;- (రాజేష్‌నుచూసి) నూరేళ్లు! మాటల్లోనే వచ్చేశారు అబ్బాయిగారు.

రాజే ;- బాగున్నారా నాన్నా ?

భూప :- బాగానేవున్నాం. ప్రయాణం కులాసాగా జరిగిందా ?

గుర :- అబ్బాయిగారు రైల్లో నిలబడేవచ్చారటండీ.

భూప :- అదేమిటి ! వారంరోజులు ముందుగానే రైల్వే ఆఫీసరుకు ఫోనుచేశాను సీటు రిజర్వు చేయించమని.

పాప :- మీమాటకూడా లెక్కచెయ్యలేదంటే ఆ ఆఫీసరు అక్కడ వుండటానికి వీల్లేదండి. వెంటనే బదిలీచేయించండి.

కర :- అందులోనూ సమితి ప్రెసిడెంటుగారబ్బాయి రైల్లో నిలబడి వచ్చారనితెలిస్తే ఇక మీపరువేమయినావుంటుందా ?

రాజే :- కరణంగారూ నాకిచ్చిన రిజర్వేషన్ క్యాన్సిల్‌చేసి థర్డుక్లాసులో వచ్చాను.

పాప :- ఏమిటీ ?

రాజే :- ఏక్లాసులో ఎక్కినా చేరేది మనఊరికే అంతమాత్రంచేత పరువుపోవలసిందేమీ లేదు.

గుర :- అంతేకాదు. సామాను స్టేషను బయటదాకా అబ్బాయిగారే మోసుకొచ్చారు.

భూప :- నువ్వేంచేస్తున్నావు ? గాడిదలు కాస్తున్నావా ?

గుర :- "ఎవరిబరువును వారే మొయ్యాలి. అనాడే బాధ్యతలు తెలుస్తాయి. అందరూ పల్లకీ ఎక్కేవాళ్ళయితే మోసేదెవరు? " అని అన్నారుబాబూ !

భూప :- అది సరేగాని పరీక్షలెలా వ్రాశావు ?

రాజే :- బాగానే వ్రాశాను. ఫస్ట్‌క్లాస్‌రావచ్చు.

కన :- రావచ్చేమిటిబాబూ ! వస్తుంది. ఎవడికోసం వస్తుంది.

పాప :- ఈరోజే మనరాజేష్‌బాబుకు ఫస్ట్‌క్లాస్ రావాలని అభిషేకం చేయిస్తాను.

రాజే :— నాకు అభిషేకాలూ — నైవేద్యాలూ — అక్కర్లేదు. మీదంతా పిచ్చిగాని అభిషేకం చేయించినంత మాత్రాన ఫలితాలు మారుతాయా ?

పాప ;— పెద్ద పెద్ద నాయకులే ప్రతిచిన్నపనికీ వ్రతాలు మొదలుపెడుతున్నారులెండి !

గుర ;— ఈమధ్యన ఆ ఏడుకొండలవాడికి మొక్కు చెల్లించనిదే అసెంబ్లీలో సీటుకూడా దొరకటంలేదు. పదబాబూ ! స్నానం చేద్దువుగాని.

రాజే ;— ఊళ్ళో పెద్దలంతా మనింట్లోనేవున్నారు. విశేషమేమిటో !

గుర ;— ఏముందిబాబూ ! భూసంస్కరణలు వస్తున్నాయిగా.

రాజే ;— సరిగ్గా సమయానికి గుర్తుచేశారు. ఈ విషయం రాగానే మాట్లాడాలనుకున్నాను. నాన్నా మనభూమిని....

భూప ;— తగినంత జాగ్రత్త చేసుకోవాలంటావు.

పాన ;— అప్రయత్నంలోనే వున్నాం.

కన ;— గుట్టుచప్పుడు కాకుండా మాపుచెయ్యబోతున్నాం.

పాప :— మంచి పథకాన్నికూడా తయారుచేశాం. పట్నంలో చదువుకున్నవారు కాబట్టి మంచి ఆలోచనే వచ్చివుంటుంది. కాస్తత్వరగా చెప్పుబాబూ !

రాజే:— నేను చెప్పబోయేది అదికాదు నాన్నా.........ముందుగా మన భూమినే ప్రభుత్వాని కప్పజెప్పాలి. మనలాంటివారు ముందుకు

వస్తేగాని మోతుబరులంతా ముందుకురారు. అంతేగాని పిచ్చి పిచ్చి ఆలోచనలుమాని ముందుగా మనభూమినే ప్రభుత్వాని కప్పజెప్పండి.

(అని లోనికివెళ్ళిపోతాడు. అంతా నోర్లువిప్పి శిలాప్రతిమల్లా చూస్తూవుండిపోతారు.)

(లైట్లు ఆరిపోతాయి.)

—o—

Lights on (లైట్లు వెలుగుతాయి) (అది భూపతిరావు ఇల్లు – రాజేష్ టేబుల్‌వద్ద కూర్చుని వ్రాసుకుంటూవుంటాడు. భూపతిరావు లోపలినుండివస్తాడు. ఒక్క క్షణం రాజేష్ వంకచూచి వీధిలోకివెళ్ళిపోతాడు. విజయ బయటినుండి పేపరుపట్టుకొని పరుగెత్తుకుంటూ వస్తుంది.)

విజ :– రాజేష్ !

రాజే :- విజయా.

విజ :- రిజల్ట్స్ పడ్డాయి — పేపరిదిగో.

రాజే :- ఏది ! (చేయిచాపుతాడు)

విజ :- (పేపరివ్వబోయిలాక్కొని) ఎంతాశ.

రాజే :- ముందు పేపరిలా ఇవ్వు.

విజ :- అంతతేలిగ్గాఇస్తే స్పెషాలిటీ ఏముంటుంది . . . (అని తప్పించుకుంటుంది. రాజేష్ వెంటపడతాడు. కుర్చీలచుట్టూ తిరుగుతూ వుంటారు. చివరకు విజయ చెయ్యిపట్టుకుంటాడు.)

రాజే :- నీకేచెప్పేది . . .మర్యాదగా పేపరివ్వు.

విజ :- నువ్వసలు పాసవలేదు.

రాజే :- ఆఁ !

విజ :- (అతనినోట్లో చాక్లెట్ వేస్తుంది.) ఆఁ. యూనివర్సిటీ అంతటికీ ఫష్టుగావచ్చావు. ఇదిగో ఫొటోతోసహా పేపర్లో వేశారు. (పేపరిస్తుంది)

రాజే :- (పేపరు చదివి) బ్రతికించావు చాలా Thanks విజయా.

విజ :- వట్టి Thanks తో సరిపోదు. గట్టిపార్టీ ఇవ్వాలి.

రాజే :- ఇవ్వకుంటే . . . నువ్వూరుకుంటావా ? మరిముందు నా . . . (దగ్గరకు రాబోతాడు)

విజ :- దూరం. . .దూరం. . .ఆమూడుముళ్ళు పడేవరకూ అయ్యగారు ఆగాలి.

రాజే :- ఆగాం . . .

విజ :- అది సరేగాని ఈమధ్య మరీ నల్లపూసవయ్యావు.

రాజే :- మరేం చెయ్యమంటావు. ఏదో అర్జంటుఫైళ్ళనీ నాముందు వేశారు నాన్నగారు. బోర్ కొడుతోంది.

విజ :- నాపనీ అలాగేవుంది. పుస్తకాలూ, రేడియోతప్ప మరేం కన్పించటంలేదు.

రాజే :- సరే . . . అలా కాలవగట్టుకు వెళదాంపద కాస్తరిలీఫ్ గానైనావుంటుంది.

విజ :- ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు.

రాజే :- కాబోయే భార్యా భర్తలు కలసి షైరుకు వెళుతున్నారనుకుంటారు.

విజ :- సరే నీఇష్టం. (అని ఇద్దరూ బయటకు వెళ్ళబోతూవుంటారు.)

(వీరయ్య బయటినుంచి వస్తాడు)

వీర :- విజయా!

విజ :- నాన్నా.

వీర :- ఇక్కడికెందుకొచ్చావమ్మా!

విజ :- రాజేష్ నాన్నా . . .

వీర :- నాకుతెలుసమ్మా భూపతిరావుగారబ్బాయి.

విజ :- యూనివర్సిటీ అంతటికీ ఫస్టుగా పాసయ్యాడునాన్నా.

వీర :- అలాగా. చాలా సంతోషం బాబూ.

రాజే :- నమస్కారమండీ.

వీర :- నమస్కారం బాబూ? నాన్నగారున్నారా?

రాజే :- లేరు అలా వీధిలోకెళ్ళారు.

వీర :- వస్తే సమ్మె విషయం మాట్లాడటానికి వీరయ్య వచ్చివెళ్ళాడని చెప్పుబాబూ!

రాజె :- ఈ సమ్మెకేదయినా పరిష్కారం వీలయినంత త్వరలో జరిగేలా చూడండి.

వీర :- ఫ్యాక్టరీ మూసి నెలరోజులైంది. సమ్మె జరుగుతూనేవుంది. కనీవినీ ఎరుగని ఈ సమ్మెతో పనుల్లేక కూలీలు - వస్తులుండ లేక పసిపాపలు - నానాబాధలు పడుతున్నారు బాబూ! వాళ్ళ ఆకలి ఆక్రందనలు వినలేకపోతున్నాం బాబూ? ఆకలికి ఆగలేక నిరాహారదీక్షలు చేస్తుంటే జైళ్ళలోపెట్టి పశువులకన్నా హీనంగా కొట్టిస్తున్నారు.

రాజే: - ఇక అలాంటివేం జరుగవు. జరుగకుండానే తగిన జాగ్రత్త తీసుకుంటాను. అలా కుర్చీలో కూర్చోండి.

వీర :- వద్దులేబాబూ ? మీముందు కూర్చొనే తాహతులేదు మాకు.

రాజే :- ఎందుకని ?

వీర :- తగినవారు కూర్చుంటేనే కుర్చీకి అందం—మీకు గౌరవం.

రాజే :- అని మీరు పొరబడుతున్నారు.

వీర :- పొరపాటు అలవాటుగా మారకుండవుండాలనే నాఆశబాబూ! పేదవాళ్ళు బంగారంపెట్టుకున్నా ఇత్తడి ముక్కలని గేలిచేస్తుంది బాబూ ఈ సంఘం.

రాజే :- అని ఎందుకనుకోవాలి. . . . .ఇత్తడిని పట్టుకొని బంగారమని నమ్మించాలి . . . . మాటకు దడవని సంఘం — మనిషికి దడుస్తుంది. ఈ సమాజ వ్యవస్థలో మీరు కూరుకుపోయారు. ఆ ఊబినుండి బయట పడలేక పోతున్నారు. జరుగుతున్నది. ఇరయ్యావ శతాబ్దమని మరచి - పదవ శతాబ్దంలోకి పారిపోవటం మీలాంటి కార్మిక నాయకులకు తగదు.

వీర :- ఇలాంటి మాటలతో కరుడుగట్టుకుపోయిన మనుష్యులు మారరు.

రాజే:- మారరని తలలు వంచుకొని కూర్చుంటే ఎలా ? మనముందు తరాలవారికి మేలుజరిగేలాచూడటం మనకర్తవ్యం. ఒకసారి తలపైకెత్తి మనముందు ఏం జరుగుతుందో చూడటానికి ప్రయత్నించండి.

విజ :- అవున్నాన్నా. . .మీబానిసత్వపు బ్రతుకులు మాకురావాలనా మీ కోరిక. మీబిడ్డల భవిష్యత్తు మీలాగేవంగి సలాములుచేసే గులాములలా నలిగిపోవాలనా మీకాంక్ష.

వీర :- అలాజరగాలని ఏతండ్రీ కోరుకోడమ్మా. . .మా అభిప్రాయాల్ని ఆరంభంలోనే తుంచివేసే కసాయివాళ్ళు కొంతమంది వున్నారు

బాబూ ఈ సంఘంలో . . . .అధికారం వాళ్ళచేతిలో. . . . .
పేదరికం మా నొసటన వ్రాసి పంపాడు విధాత.

రాజే :- అని మీరు ఊహించుకుంటూన్నారు. పుట్టుకతో ఎవరూ పదవి తెచ్చుకోరు అధికారాన్ని మోసుకురారు. ఆపదవిని ఇస్తున్నది మీరు. మీచేతులమీదుగా ముద్రవేసి గద్దెకెక్కిస్తున్నారు. టోపీ ధరించిన వాడల్లా నాయకుడుకాదు. . . . .కలంపట్టినవాడల్లా కవికాదు. నామాలుపెట్టినవాడల్లా భక్తుడుకాదు. . .

వీర ;- నువ్వుచెప్పిందీ నిజమేబాబు! రోజంతా గొడ్డుచాకిరిచేసినా ఆకాశాని కంటే ఈ ధరలకు అర్దాకలే మిగులుతుంది - కడుపునిండా కూడులేని మేం ఏంచెయ్యగలం - ఏం సాధించగలం బాబూ ! అధికారుల ఉక్కుహస్తాల్లో నలుగుతున్నాయి బాబూ మా బ్రతుకులు.

రాజే ;- వాళ్ళనలా తయారుచేసింది మీరు. మారుతున్న యుగంతోపాటూ మీరూ మారాలి. అలామారని వాళ్ళను మార్చాలి — ప్రతి యువకుడూ అల్లూరి సీతారామరాజుగా మారాలి - ప్రతియువతి ఝాన్సీరాణిలా తయారవ్వాలి. ప్రతిబాలుడూ పలనాటి వీరబాలుని మురిపించాలి. ఆనాడే నవసమాజ నిర్మాణం జరుగుతుంది. ఆనాడే మనకలలు ఫలిస్తాయి..

వీర ;- దౌర్జన్యంతో సమాజాన్ని మార్చలేంబాబూ ! అది రాక్షసత్వం అవుతుంది. మనిషిని - మనిషి హింసించేది మానవత్వమనిపించు కోదు, అహింసా శాంతే మన ఆయుధాలు-మనబ్రతుకు బాటలూ అవేబాబూ !

విజ :- నాన్నా ఇన్ని విషయాలు తెలిసిన నీవు అంటరాని తనాన్ని రూపు మాపి, నవసమాజాన్ని సృష్టించి, సమానత్వాన్ని స్థాపించలేక పోయావా ?

వీర :- పూజ్యబాపూజీ పుణ్యమా అని సమాజం చాలవరకు మారిందమ్మా ఎంతమంది త్యాగులు ఈకుల పిశాచానికి బలైనా ఇంకా మొదట్లోనేవున్నాము. దీన్ని రూపుమాపాలంటే..........

రాజే :- వీరయ్యగారూ ?

వీర :- ఏమిటి బాబూ !

రాజే ,- ఒక మాటడుగుతాను సమాధానం చెప్పండి.

వీర :- సందేహించకు చెప్పుబాబూ !

రాజే :- పల్లానికి ప్రవహించేనీటికి-ఏనాటికయినా ఎత్తులోవున్న శిఖరాన్ని తాకాలనే కోరికవుండదా ?

వీర :- వుంటుందిబాబూ ! కాని ఎలాసాధ్యమవుతుంది.

రాజే ॥- సాధించాలంటే సాధ్యపడనిదంటూ ఏదిలేదు — శిఖరానికంటే ఎత్తైన ఆనకట్టకట్టినపుడు శిఖరాన్నేకాదు — అనంతాకాశాన్నే తాకవచ్చు.

విజ :- రాజేశ్.

రాజే :- వీరయ్యగారూ—మీకేం అభ్యంతరం లేకపోతే.

వీర :- చెప్పుబాబూ !

రాజే :- విజయా నేను ఒకర్నొకరం అర్థంచేసుకున్నాం. మనసిచ్చి పుచ్చుకున్నాం.

వీర :- బాబూ !

విజ :- అవున్నాన్నా. . .ఈ విషయం నీకు ముందుగానే తెలియ చేద్దా మనుకున్నాను. తగిన సమయంకోసం ఎదురుచూస్తున్నాను. . . వారు చాలా మంచివారు నాన్నా.

వీర :- విజయా. . . కోయిలతో కాకి సాంగత్యంచేసినంత మాత్రాన— దాని గానాన్నాలాపించటం సాధ్యపడదు తల్లీ.

విజ :- రాజేశ్ కన్ని విషయాలూచెప్పాను. అంటరాని తనాన్ని రూపు మాపాలన్నదే రాజేష్ ఆకాంక్షనాన్నా.

రాజే :- మీరు హరిజనులైనంత మాత్రాన — మీలో ప్రవహించేది రక్తంకాదా ? మీరు మనుష్యులుకారా ? మీకి సమాజంలో గౌరవంలేదా ?

వీర :- ఆ సమాజానికి శాసనకర్త మీనాన్నేనని మాత్రం మర్చిపోకు.

రాజే :- నాన్నేకాదు . . . . . . నా ఈ సమతత్వానికి ఎవ్వరడ్డువచ్చినా నా నిర్ణయం మారదు. నాకు తెలిసినంతవరకు రెండేరెండు కులాలు — ఒకరు పీడించేవాళ్లు మరొకరు పీడించబడేవాళ్ళు సంపద సౌఖ్యం ప్రకృతికి అందరు సమాన భాగస్వాములు కావాలి — ఇదే నాకోరిక

విజ :- నాన్నా. . . . .మనమీ కూపస్థమండూకంలాంటి సంఘంనుండి బయటపడాలంటే - మంచీ - చెడుల సమస్యలతో నలిగిపోతున్న ఈ కుళ్ళు సమాజంనుండి. ప్రగతి పథంలో కాలిడుతున్న నూతన మార్గంలో పయనించాలి.

వీర :- అమ్మా . . . విజయా . . . తల్లిలేని నిన్ను పెంచి—పెద్దచేసి— విద్యాబుద్ధులుచెప్పించి చూస్తూ - చూస్తూ నీకు ద్రోహం నెలా చేయగలనమ్మా.

విజ :- నాన్నా.

వీర :- ఇటుచూడమ్మా. . .ఈ బంగారు భవంతుల నొక్కసారిచూడు. కార్మికుల కండల్ని కరిగించి సీసంగాపోసి నిర్మించిన భవంతులమ్మా ఇవి. . .ఈ పసిడిమేడలకు చాలాదూరంగా - కనుపించనంత దూరంగా వుందమ్మా మన పూరిగుడిసె - ఈభవంతుల పునాదులలో పాతుకుపోయాయమ్మా రాజేశ్ పసిపాదాలు ఒకవేళ దూరంగా పారిపోవాలన్నా, ఆకాశమంతఎత్తు ఎగిరిపోవాలన్నా కాలుకదపలేదమ్మా. . . .పరుగెత్తి పాలుతాగేకన్నా . . . మన లాంటివాళ్ళు నిలబడి గంజితాగటమే మంచిదమ్మా. . . . . మనసు రాయిచేసుకోతల్లీ

రాజే :- వీరయ్యగారూ—మీరూహించుకున్నంత—పిరికివాణ్ణికాదు — చేతగాని దద్దమ్మనుకాదు. సంపదను చూసుకొని - తండ్రికి భయపడి కర్తవ్యాన్ని మరచిపోయేటంతటి నమ్మకద్రోహిని కాదు నేను - మీరు పాతకాలంలోవుంటే విజయలాంటి యువతులకు న్యాయం చేకూరేదెలా ?

విజ :- నాన్నా....కాదనకు ... ఈ ఒకసారి నన్ను మన్నించు....నాన్నా. . జీవితంలో నేకోరిన మొట్టమొదటి కోరిక ఇదేనాన్నా....ఈపెళ్ళి కంగీకరించు.

వీర :- మీరెన్నిచెప్పినా ఈ పెళ్ళిజరుగదు. . . .ధనవంతుల దప్పికకు దాహంగా మారటం నాకిష్టంలేదు. . .నా బిడ్డకు తగిన సంబంధం నేచూసుకుంటానుబాబు . . . ఈ రోజున మీరు సంస్కారమని చేసుకున్నా లోకం హర్షించదు. వీరయ్య ధనదాహం కోసమే ఈపని చేశాడంటారు. నాబిడ్డ ఈ ఆస్తికి వారసురాలు కావాలని

కుట్రపన్ని నిన్ను వలలో వేసుకుందని ఆడిపోసుకుంటారుబాబూ!
ఈ సమాజానికి చెవులేగాని - కళ్ళులేవుబాబూ!

విజ :- కళ్ళులేని గ్రుడ్డి సంఘంకోసం మానిండు జీవితాల్ని బలిచేస్తావా నాన్నా.

వీర :- బలిచేసిందీ - చేయబోతున్నదీ నేను కాదమ్మా. . .అటుచూడు. నువ్వు ఎవరినైతే ప్రేమించి — పెళ్ళిచేసుకోవాలని ఉబలాట పడుతున్నావో — ఆ బంగారుబాబును కన్న తండ్రమ్మా?

రాజే :- వీరయ్యగారూ ఏమిటి మీరంటున్నది?

వీర :- నేనుచెప్పేది నీ కర్థంకాదుబాబూ! పట్టణాల్లో, పాఠశాలల్లో పదిమంది స్నేహితులతో పసందుగా గడిపిన నీకు కొత్తగానే వుంటాయి. మీనాన్నచేస్తున్న — చేయిస్తున్న అఘాయిత్యాలకు నలిగిపోయాం మేం.!

రాజే :- వీరయ్యగారూ. . .మాట్లాడేముందు మంచి — చెడులను మననం చేసుకోవటం మంచిది.

వీర :- అర్థంచేసుకొనే ఈస్థితికి వచ్చాం. . . . .రైతులరక్తాన్నిగ్లాసుల్లో వంచుకొని — విస్కీలుగామార్చి — కార్మికులకండల్ని కరగించి— ఐసుముక్కలుగా వేసుకొని ఆనందంగాత్రాగే భూపతిరావును మనస్ఫూర్తిగా అర్థంచేసుకున్నాను.

రాజే :- వీరయ్యగారూ! విజయను పెళ్ళిచేసుకోబోతున్నది నేను — మా నాన్నకాదు.

విజ :- అవున్నాన్నా. . .రాజేష్ అలాంటివాడుకాదు . . .నువ్వు అపార్థం చేసుకుంటున్నావు.

వీర :- రాజేష్ మంచివాడేకావచ్చు – ఉత్తముడేకావచ్చుకాని రాజేష్‌లో ప్రవహించేది ఆ భూపతిరావు రక్తమే. . .ఈ రాజేష్ అణువు–అణువు పెరిగింది కష్టజీవుల కండలతోనేనమ్మా. . . .పేదల ప్రాణాలతో చెలగాటమాడే కసాయివాడమ్మా రాజేష్ తండ్రి – అలాంటివాడి ఇంటికోడలుగా నువ్వెళ్ళటం నాకిష్టంలేదమ్మా . . ఇష్టంలేదు.

రాజే :- దొంగకొడుకు దొంగగానే–హంతకునికొడుకు హంతకునిగానే–నాయకునికొడుకు–నాయకుడిగానే పుట్టాలనే నియమముందా ?

విజ :- నాన్నా. . .నీనిర్ణయం మార్చుకో నాన్నా.

వీర :- చెప్పవలసిందంతా చెప్పాను–కన్నవాడు కాకపోయినా – పెంచినవాడనైన ఈ తండ్రికి కూతురుగావుండాలో – మంచిమనసుతో ప్రేమించి నిన్ను అందలమెక్కించబోతున్న రాజేశ్‌కు భార్యగా ఉండాలో – అధికార గర్వముతో అన్యాయాల కెదురాడని భూపతిరావుకు కోడలుగా వుండాలో – కుక్కిమంచాలతో కుమిలిపోయే మన ఇల్లుకావాలో – బంగారపుటుయ్యాలలతో నిండిన ఈ ఇల్లుకావాలో నువ్వే నిర్ణయించుకోమ్మా.

రాజే :- వీరయ్యగారూ. . .నిర్ణయించుకోవలసింది నేను – నాకీ బంగారు భవంతులు – ఫ్యాక్టరీలూ – కార్లతో నిమిత్తంలేదు – ధనికా – పేద ఏమిటీ తారతమ్యం – ఈ సిరులు శాశ్వతమా ? మనసుకు ధనికుడైనవ్యక్తి ఏవిషయంలోనూ పేదకాదు – కోటానుకోట్ల విలువచేసే మీ మనసు నన్నాకట్టుకుంది – మీ మంచి నన్నాకర్షించింది. . .పదండి. . .

వీర :- ఎక్కడికి ?

రాజే ;- నిలువనీడలేక – ఆకలీఅని అల్లాడే నిరుపేదల నిజజీవితాల్లోకి – నాసుందర స్వప్నాలకు సరియైన రూపకల్పన చేసుకోటానికి నేను నిర్మింపదలుచుకొన్న నవయువ సమాజాన్ని ఒకసారి తృప్తిగాచూడాలి. ఒక్క వేడినిట్టూర్పుతో బాధలనన్నిటినీ అర్థంచేసుకోవాలి. . .కదలండి.

వీర ;- వద్దుబాబూ ! వద్దు . . . అక్కడ నువ్వొక్కక్షణం వుండలేవు.

రాజే ;- నేను శాశ్వితంగా వుండిపోవటానికి రావటంలేదు. మీతో ఒక్క ఘడియగడిపి. . . . .ఆ ఆనందాన్ని అనుభూతిని చూడటానికి వస్తున్నాను. . .కాదనకండి . . . (గురవయ్య లోపలనుండి వచ్చిచూస్తూంటాడు.)

వీర ;- సరే. . .నీయిష్టంబాబూ.

(ముగురూ వెళుతూవుంటారు. గురవయ్యా అక్కడే వుంటాడు.)

"Lights off"

—o—

(లైట్లు వెలుగుతాయి)

(అదేసెట్టు తెరలేచేసరికి భూపతిరావు ముందు- వెనుక గురవయ్య పచార్లు చేస్తుంటారు.)

భూప :- గురవయ్యా నువ్వుచూసింది వాణ్ణేనా ?

గుర :- అమ్మమ్మ....ఎంతమాట తమఉప్పు తింటున్నవాణ్ణి మీదగ్గర అబద్దమాడతానా ? ఈరెండు కళ్ళతోచూశాను.

భూప :- ఇంకా ఏమన్నాడు,

గుర :- మీరే ఈ ఊరంతటికీ మోతుబరులని విఱ్ఱవీగుతున్నారట మీ కోరలు విరగదీయాలంటే మీ కుమారుణ్ణి వలలో వేసుకోవాలని ఆ వీరయ్య స్వయంగా అంటూవుండగా విన్నాను.

భూప :- అంతమాటన్నాడా ?

గుర :- అంతటితో ఆగాడా....మీఅబ్బాయి వాడల్లుడయితే మీరేకుక్కలా పడుంటారట మీరు.....

భూప :- గురవయ్యా .. ఇంకేంచెప్పొద్దు. ఆలోచనల్ని ఆరంభంలోనే తుంచెయ్యాలి. మొక్క మానయితే వంచటం తుంచటంకూడా కష్టమే. ఈ భూపతిరావంటే ఏమనుకుంటున్నాడో ఏమో చూస్తాను వాడి అంతుచూస్తాను.

గుర :- ఒక్కవాణ్ణేకాదు. ముందుదానికి బుద్ధిచెప్పాలి. ఎఱ్ఱగా, బుఱ్ఱగా వున్నాడుగదా అనిఅబ్బాయిగారిని వలలో వేసుకొని కులకాలను కుంటున్నది. వగలాడి.

భూప :- దానిసంగతీ చూస్తాను. పులితోనే ఆడుకోవాలనుకుంటున్నది. పంజాదెబ్బను ఊహించటంలేదు.

గుర :- అంతేకాదు....అసలు విషయం మీకు తెలియదనుకుంటాను.

భూప :- ఏమిటది ?

గుర :- అది వీరయ్యగాడి కూతురుకాదు. లచ్చిగాడి కూతురుండేది. ఏది- ఆ ఎల్లమ్మ—దానికూతురు. అదిచెడిపోయి దీన్ని వీడికప్పగించి మరీపోయింది.

భూప :- అయితే మనవాడు వెంటేసుకు తిరిగేది ఆ అంటరాని దాన్నన్న మాట.

గుర :- అంతటితో ఆగారా పెళ్లి చేసికోబోతున్నారట.

భూప :- పెళ్లికాదు వాళ్ళకు జరిగేది పెటాకులు-ఈ ఊళ్ళో నాపరువేమిటి? డిగ్రీఏమిటి? దాన్నేమయినా లెక్కచేస్తున్నాడావాడు. గురవయ్యా! వాడున్నాడా ?

గుర :- ఎవరయ్యా ?

భూప :- వాడేనయ్యా.....నా సుపుత్రుడు.

గుర :- అబ్బాయిగారా! ప్రొద్దుటనగా వెళ్ళారయ్యా భోజనానికికూడా రాలేదు.

భూప :- ఆఖరికి ఆకులం తక్కువదానిచేతికూడు కూడా తింటున్నాడన్న మాట. ఛీ — ఛీ నాకడుపున చెడపుట్టాడు. వీణ్ణసలు పట్నం పంపించటమే నా బుద్ధితక్కువ.

గుర :- పట్నం పంపించకపోతే మరి—కట్నమెలా వస్తుందండీ!

భూప :- అదీనిజమే. వీడిమీద రెండులక్షల బేరంపెట్టుకొని కూర్చున్నాను. అందులోనూ యూనివర్సిటీ అంతటికీ ఫస్టురావడంతో—రేటూ పెరిగిపోతుంది. ఇక ఆ పెద్దమనుషులకేం సమాధానంచెప్పాలి. ఇక ఇలావదిలేస్తే లాభంలేదు.....గురవయ్యా!

గుర :- అయ్యా!

భూప :- ఆవీరయ్య ఎక్కడవున్నా క్షణాలమీద నేరమ్మన్నానని చెప్పి తీసుకురా.....(అని గురవయ్య చెవిలో ఏదో చెపుతాడు.)

గుర :- ఆమాత్రంచెప్పాలా ? క్షణాలమీద జరిపించనూ (గురవయ్య బయటికి వెళతాడు. క్షణం నిశ్శబ్దం పూజారి పాపయ్య ప్రవేశం)

పాప :- (వస్తూనే) ఇక ఆగేటట్లులేవు వచ్చేళాయి.

భూప :- ఏమిటయ్యా ?

పాప :- ఇంకేమిటి. ఆర్డినెన్సు. రేపో మాపో స్పెషల్ కమిటీ వస్తుందట. ఇలాచూస్తూ ఊరుకుంటే గద్దలు తన్నుకుపోయినట్లు ఎగరేసుకుపోతారు.

భూప :- నేను గోళ్ళుగిల్లుకుంటూ కూర్చున్నానా ? రాత్రింబవళ్ళు దాన్ని గురించే ఆలోచిస్తున్నాను.

పాప :- ఆలైసెన్సులు కాస్తా మనచేతిలో పడితే ఎవరూ ఏమీచెయ్యలేరు.

భూప :- ఈ అసెంబ్లీ ఎన్నికలు జరిగితేనేగాని మన లైసెన్సులు రావటం జరగదు. అంతా ఎన్నికల ఫలితం మీద ఆధారపడి వుంటుంది.

పాప :- శ్రీరామచంద్రమూర్తి ఎంతమాట వింటున్నానయ్యా ఆ లైసెన్సులు రాకపోతే నాప్రాణాలుంటాయంటారా.

భూప :- వుండకేం ఊడిపోతాయా ? అన్నిటికీ కంగారే.

పాప :- అలా కోప్పడితే ఎలాచెప్పండి పిల్లలు గలవాణ్ణి పెళ్ళానికి దడిపి బ్రతుకుతున్నవాణ్ణి మిమ్మల్నే నమ్ముకొని జీవిస్తున్నాను.

కన :- (కరణం కనకయ్య ప్రవేశం) ఓ పాపయ్యగారా! మీరూ ఇక్కడే వున్నారా?

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

పాప :— ఇంతదాకా వచ్చినతరువాత ఇంకెక్కడుంటాం అంతా ఒకచోటే.

కన :— భూపతిరావుగారూ ! ఈవార్త విన్నారా ?

భూప :— ఏమిటయ్యా అది.

కన :— వీరయ్య విషయం.

పాప :— ఎవరూ ? ఆ పొగాకు కంపెనీ జనానికి నాయకుడు.

కన :— ఆ .. నాయకుడేలేవయ్యా. వాడికి పెత్తనమిచ్చినంతమాత్రాన ఇలాంటిపనులు చేస్తాడా !

భూప :— నేనూ వాడి విషయమే ఆలోచిస్తున్నాను.

కన :— ఈ విషయం మీదాకా వచ్చిందీ.

పాప :— విషయం విషయం అంటారేగాని అసలు విషయం చెప్ప రేమిటండీ.

కన :— ఇంకేమిటి మీ విషయమే మీరాములవారి మాన్యంలో అలగా జనానికి ఇళ్ళువేయించాలనుకుంటున్నాడట వీరయ్య ప్రభుత్వం దగ్గరనుండి పట్టాకూడా తెప్పించాడట.

పాప :— ఓరి నాయనో నాకే ఎసరుపెట్టాలనుకొంటున్నాడూ ! నాలుగు రోజులు నేను ఊళ్ళోలేనుగదా అని ఇలాంటిపనులు చేయిస్తాడా. అది దేవుడిమాన్యం ముట్టుకుంటే మసైపోడూ !

కన :- వాడికి తోడుగా ఏం చెప్పమంటారు.

భూప :- నాదగ్గర దాపరికమెందుకు.

కన :- ఆపన్లన్నీ మనరాజేష్ బాబుగారే దగ్గరుండి చేయిస్తున్నారట.

పాప :- ఎవరూ మన భూపతిరావుగారబ్బాయా ! నేను మొన్ననే అను కున్నాను. ఆ వీరయ్యగాడి కూతుర్ని ఏది ఆ అంటరానిదాన్ని వెంటేసుకొని సరాసరి గుళ్ళోకొచ్చారు. "బాబూ ! మీరు

రావచ్చుగాని అది రావటానికి వీల్లేదన్నా అంతే దాంతోనన్ను నానామాటలని అంతుతేలుస్తానని బెదిరించి మరీవెళ్ళారు.

కన :- భూపతిరావుగారూ ! ఈ విషయంలో మీరుగట్టిచర్య తీసుకోవాలండి. లేకపోతే అబ్బాయిగారు....

పాప ;- చెడిపోవటం ఖాయం. మీపలుకుబడి హోదా ఏమైపోవాలి.

కన :- ఇప్పటికే సగం ఊరికితెలిసిపోయింది. గుట్టుచప్పుడుకాకుండా తండ్రీ – కూతుర్ని ఊరుదాటించాలి.

భూప :- ఊరుదాటించినంత మాత్రాన సరిపోదు ఏరుదాటించాలి. నాతో పగబెట్టుకున్న వాళ్ళెవరూ బ్రతికి బయటపడలేదు. పంతం పట్టాలేగాని – అంతంచూసేవరకూ నిద్రపోడీ భూపతిరావు.

(పానకాలు ప్రవేశం చేతిలో పేపరు వుంటుంది)

పాన ;- భూపతిరావుగారూ ఈ ఘోరం విన్నారా ?

పాప :- ఘోరమా !

పాన ;- ఘోరంకాదు. దారుణం. ఇదిగో ఈ పేపరు పై పేజీలో యూనివర్సిటి అంతటికీ ఫస్టుగావచ్చిన రాజేష్‌కు బంగారుపతకాన్ని ఇవ్వబోతున్నారట.

భూప :- ఓరినీ ఈ విషయానికే ఎంత హంగామా చేశావయ్యా.... .......

పాన ;- ఈవెనుక పేజీచూడండి... తాటికాయంత అక్షరాలతో "తండ్రి కొడుకులపోటీ" అనివుంది.

కన :- అదీ ఓపెద్ద ప్రకటనేనటయ్యా..........మరీ భార్యాభర్తలే విడాకులిచ్చుకుని మరీ పోటీ వెలగబెడుతున్నారుగా ఈమధ్య.

పాన ;- ఎవరో అయితే ఇంత బాధపడవలసిందెందుకు ? మన భూపతిరావుగారి సుపుత్రుడు రాజేష్ పోటీచేస్తున్నాడట !

కన :- ఏమిటీ రాజేష్ ఎన్నికల్లో నిలబడుతున్నాడా !

పాప :- ఈ జిల్లాకే పెద్దమనిషి తనతండ్రిగారు నిలబడుతూవుంటే పోటీగా నిలబడుతున్నాడా !

పాన :- అసలిదంతా తండ్రీ కొడుకుని వేరుచెయ్యటానికి వీరయ్య పన్నిన పన్నాగమే.

భూప :- అయినా వాడికి బుద్ధుండక్కర్లా నాకు పోటీగా నిలబడతాడా ? (పేపరు తీసుకొని చదువుకుంటాడు)

కన :- అంతావెర్రిగాని తండ్రితో పోటీపడి కొడుకు గెలుస్తాడంటారా ?

పాన :- ఏదో చదువుకున్నానుగదా అని వేడిరక్తంతో ముందుకు పరుగెడుతున్నాడుగాని, అదికాస్తాచల్లబడిపోతే పోటీవుండదు, పరువూ వుండదు.

పాప :- ఇది మనకందరికీ అవమానం.

భూప :- ఏదో చదివి ప్రయోజకుడవుతాడనుకొన్నానుగాని ఇలాపనికి మాలిన వాళ్ళను వెంటేసుకుని ఊరేగుతాడనుకోలేదు.

కన :- మీతో రాజేష్ కాదుగదా ? ఆబ్రహ్మదేవుడు పోటీకి నిలబడ్డా ఓడిపోవటం ఖాయం.

భూప :- ఇదిగో పేపరుచూడండి. ఇన్ని సంవత్సరాలూ ప్రజాసేవచేసిన నాకే తిరిగి టిక్కెట్టు లభించింది.

కన :- ఆపత్‌బాంధవులు మీలాంటివారి పాలిట కల్పవృక్షం. మీకు సీటురావాలి మాపంటపండాలి.

పాప :- ఆ ఏడుకొండలవాడికి ఇరవై ఒక్కసారి అభిషేకం చేయించిన మీకురాక ఆ సీటు మరెవరికి వస్తుందండీ.

పాన :- పంతులమ్మను మొదలు ...జిల్లాకలెక్టరువరకు క్షణాలమీద బదిలీ చేయించగల సమర్థులు మీమీదగెలిచే తాహతు ఎవరి కుంటుంది లెండి.........

భూప :- హైదరాబాదులో ఆరురోజులు — ఢిల్లీలో తొమ్మిదిరోజులు వస్తులుండి పడిగాపులుకాసి మరీ సంపాదించుకొచ్చానీ సీటును.

కన :- అసలిదంతా వీరయ్యగాడు చేసుంటాడు. లేకపోతే రాజేష్ మీముందు నిలబడగలుగుతాడా ।

పాప :- కరణంగారు చెప్పింది అక్షరాల నిజం.

(వీరయ్య ప్రవేశం వీరయ్యనుచూసి అందరూ ఒకరిమొఖా లొకరు చూసుకుంటారు.)

వీర :— పిలిపించారట ?

భూప :— ఎందుకు పిలిపించానో నీకుతెలీదా ?

వీర :— తెలిస్తే మిమ్మల్లెందు కడుగుతాను.

భూప :— ఏమిటా తలబిరుసు సమాధానం.

వీర :— తల బిరుసెక్కటానికి మాదగ్గర వాసన నూనెలుండవులెండి.

భూప :— ఈమధ్య రాజకీయం వంటబట్టిందనుకుంటాను.

వీర :- ఇరవై సంవత్సరాలనుండి మిమ్మల్ని వరించని రాజకీయం నాకెలా వంటబడుతుంది.

పాన :- అయితే భూపతిరావుగారు నాయకులు కాదంటావు.

వీర :- అని నేనెలా అనగలుగుతాను ఇంతమంది మీరు వంతపలుకుతూ వుంటే.

భూప :- ఇప్పుడు నిన్ను పిలిపించింది మాకు నీతులు చెప్పటానికికాదు.

వీర :- మేము నీతులుచెప్పినా మీకు బూతులుగానే వుంటాయిలెండి.

భూప :- రాజేష్ ఎవరో తెలుసనుకుంటాను.

వీర :- తెలియకేం బాగాతెలుసు ఒకదబ్బున్న తండ్రికి కొడుకు. మంచి మనసు–త్యాగబుద్ధివున్న మానవుడు. కార్మికులకష్టాల్ని–రైతుల బాధల్ని అర్థంచేసుకున్న — రాబోయేకాలంలో — కాబోయే నాయకుడు.

భూప :- భేష్! బాగావర్ణించావు. ఇంకేమయినా మిగిలిందా? ఒక దరిద్ర గొట్టుదాన్ని వెంటేసుకు తిరుగుతున్న తిరుగుబోతను.

వీర :- భూపతిరావుగారూ?, నన్నేమయినా అనండి సహిస్తాను. నాబిడ్డను నా ఎదుటే దూషిస్తుంటే సహించలేను.

భూప :- నాకన్నకొడుకును–నానుండి దూరంచెయ్యాలని కుట్రపన్నుతుంటే నేనెలా సహించేది.

వీర :- మేమేంకుట్ర పన్నటంలేదు.

కర :- కుట్రకాక మరేమిటి. అన్నెం పుణ్యం ఎరుగని రాజేష్‌బాబుకు నీకూతుర్ని ఎరగా చూపించి ప్రేమపిచ్చి పుట్టించావు.

పాన :- తండ్రిమాట జవదాటని వాడిని తండ్రికే పోటీగా నిలబెట్టావు.

పాప :- గుళ్ళూ గోపురాలు చుట్టూ ప్రదక్షిణాలు చేయిస్తున్నావు. ఇది చాలాదూ ఇంతకంటే ఇంకేంకావాలి.

వీర :- మీరు పొరబడుతున్నారు. రాజేష్ నాయకుడు కావాలని నేను కోరలేదు. ఆకలిగొన్న ప్రజానీకంకోరింది. మీ ఉక్కు-హస్తాల్లోనలిగి విసిగివేసారిన ప్రజావాహినికి ఇంతకాలానికొక విజయశంఖం దొరికింది. ఇక పూరించకమానరు.

భూప :- ఆశంఖారావంనుండి వెలువడేవి విజయ దుందుభిలుకావు ఆర్తనాదాలే గుర్తుంచుకో.

పాన :- ఇకనైనా రాజేష్‌ను పోటీనుండి విరమింపజేయి నీకు కోరినంత డబ్బిస్తాం.

కన :- నువ్వు ఊఁ అంటేచాలు. సలక్షణమైన మేడ కట్టించి ఇస్తాం.

పాప :- భూపతిరావుగారు గెలిస్తే మీకు మాకు లాభం.

కన :- అధికారం భూపతిరావుగారి చేతిలో వుంటే ఎలాగయినా భూమిని దక్కించుకుంటాను.

పాప :- సామాన్యం నాకు దక్కుతుంది.

పాన :- ప్రతిపక్షంలోవుండి రాజేష్ సాధించే దేముంటుంది.

కన :- కంఠశోష వచ్చేవరకూ అరిచి కూర్చోవటంతప్ప.

పాప :- సముద్రంలో ఆవగింజలా మీరేం సాధించలేరు. మేం చెప్పినట్టువిను.

వీర :- డబ్బుకు ఆశపడి జీవితాన్నే నాశనంచేసుకొనే దళారినికాదు నేను. రాజేష్‌లాంటి యువకులు ఈ సమాజానికికావాలి. మీలాంటి సంఘనిరోధకశక్తులు ఆరిపోవాలంటే రాజేష్‌లాంటి జ్యోతులు వెలగాలి. కోటికాంతులతో వెలగాలి.

భూప :- వీరయ్యా ఎవరితో మాట్లాడుతున్నావో గుర్తుందా ?

వీర :- ఏం బెదిరిస్తున్నారా !

పాన :- మాతోవిరోధం పెట్టుకున్న వాడెవడూ ఈ ఇంటిగడపదాటి బయటికి వెళ్ళిఎరుగడు.

కన :- అనవసరంగా లేనిపోని వ్యవహారాలన్నీ పైనవేసుకోవటం మంచిదికాదు.

పాప :- అందిన నైవేద్యంతిని అందని పానకంకోసం ఎదురు చూడటం మంచివాళ్ళ లక్షణంకాదు.

భూప ;- రాజేష్‌ను ఒప్పించు ఈ నాటివరకూ నాకుపోటీగా నిలబడ్డవాడు లేడు. మంచిగా చెపుతున్నాను లేదా....

పాప :- నయాపైసలతో బాకీచెల్లించు.

వీర ;- భూపతిరావుగారూ మీకివ్వవలసిన వెయ్యిరూపాయలు ఈ సంవత్సరం పంటరాగానే ఇచ్చేస్తాను.

పాప :- వెయ్యిరూపాయలు నువ్వు తీసుకున్నప్పుడు .. ఇప్పుడు.

వీర :- ఎంతయిందంటారు ?

భూప :- అసలు—వడ్డీలతోసహా అయిదువేలరూపాయలు.

వీర ;- అన్యాయం.

భూప :- దాన్నే మాభాషలో వడ్డీఅంటారు.

పాన :- వట్టివడ్డీకాదు—చక్రవడ్డీ.

కర :- వున్నకొద్దీ పెరుగుతూనే వుంటుంది. (తనపొట్టను చూపిస్తాడు)

వీర :- భూపతిరావుగారూ పేదలరక్తాన్ని పీల్చెయ్యటం న్యాయంకాదు. నాలాంటి చిన్నరైతుల కడుపుకొట్టటం ధర్మంకాదు.

భూప -; న్యాయం ధర్మం ...ఇవన్నీ నీగూడెంలో జనానికిచెప్పు వింటారు. చప్పట్లుకొడతారు — విన్నాక సంఘానికి నాయకుణ్ణిచేస్తారు. ఇక్కడమాకు కావలసింది పదవి.... పెదవి.... మందూ... మజా.. (నలుగురూ నవ్వుకుంటారు)

(భూపతిరావు టేబుల్ దగ్గరకెళ్ళి ప్రాంసరీనోటు తీసుకు వస్తాడు)

భూప :- (నోటుచూపిస్తూ) వీరయ్యా ! ఇదిగోనువ్వు నాకువ్రాసి ఇచ్చిన ప్రాంసరీ నోటు....

పాన :- వీరయ్యా....ఇవిగో పది సంవత్సరాలు కష్టపడి సంపాదించినా కూడబెట్టలేనంత డబ్బు (చూపిస్తాడు)

కన -: ఈరెండూ నీకే దక్కుతాయి.

భూప :- ఒక్కదెబ్బకు రెండుపిట్టలు కాదనకు.

పాప -; తంతే గారెల బుట్టలోపడ్డట్టుంది. ఊ ....కాదనకు....

కన :- కాళ్ళవద్దకు వచ్చిన అదృష్టాన్ని కాలదన్నితే కాశీకివెళ్ళినా దొరుకదు.

(వీరయ్య నలుగుర్నీ ఒక్కసారి చూస్తాడు. నలుగురూ వీరయ్యవైపే ఆశగాచూస్తుంటారు)

వీర -; ఆశచూపించి—బానచేయించు కోవాలనుకుంటున్నారు. పచ్చని నోట్ల కాంతులకు కరిగేవికావండీ మా ఆశయాలు.

భూప :- వీరయ్యా మరొచిన్నపని చేసిపెట్టు.

వీర -; ఏమిటిది.

భూప :- మేమంతా మీకు బాకీవున్నట్టు నోట్లు సృష్టిస్తాం. దానికి మీరు కోర్టులో సాక్ష్యంచెప్పాలి.

వీర :- ఏమిటి మీరు మాదగ్గర అప్పుతీసుకోవటమా ?

కర :- పోనీ మీరే మాకు అప్పుపెట్టినట్టు—మేం పుచ్చుకున్నట్టు.

పాన :- అవికూడా ఈ భూసంస్కరణలు అమలు జరిగేంత వరకేలే.

పాప :- ఆ తరువాత నోట్లువుండవు. నీబాకీవుండదు ఏమంటావు.

భూప :- మీజనం తత్వం నాకు బాగాతెలుసు. వట్టిగొర్రెలమంద. నువ్వు ఏంచెప్తే దానికంతటికీ తలాడిస్తారు. అందుకే ఈపనికి ముందు నిన్ను పిలిపించాను.

వీర :- శాసనాన్నుంచి తప్పించుకోవటానికి మీరు పన్నినపన్నాగమన్న మాట.

భూప :- కాదు. అన్యాయంగా వశంచేసుకోబోతున్న మాభూముల్ని కాపాడుకోవటం.

వీర :- అధికారవర్గంలో వుంటూ—పైకి నీతులుచెపుతూ—వెనుక గోతులుతీసే మీలాంటి దగాకోరులనే ప్రభుత్వం నమ్మతుంది – గద్దె చేతికిస్తుంది. చట్టాల్ని మార్చినట్లు—ప్రజల్ని మార్చాలనుకోవటం పొరపాటు. నాప్రాణంపోయినాసరే ఈ దారుణానికి ఒడిగట్టలేను. నమ్మకున్న ప్రజలను మోసంచెయ్యటం నా తరంకాదు

పాన :- ఇలా మాటలతో వినడండీ........

(భూపతిరావు పూజారి పాపయ్యకు సైగచేస్తాడు పూజారి దగ్గరకొస్తాడు. పూజారి చెవిలో ఏదోచెపుతాడు. పాపయ్య లోనికి వెళతాడు)

భూప :- వీరయ్యా మంచిగా చెపుతున్నాను. నీవెనుకేదో బలగముందని భ్రమపడుతున్నావు. నిండు బ్రతుకుల్నే బండలు చేసుకోబోతున్నావు.

(లోపలినుండి పూజారి పాపయ్య బ్రాందీసీసా గ్లాసులుతెచ్చి టేబుల్‌మీద పెడతాడు. ఒకతాడుతెచ్చి పానకాలుకు ఇస్తాడు. ఆ తాడును పానకాలు ఒకప్రక్క కరణం ఒకప్రక్క పట్టుకొని ముందుకు అడుగువేస్తారు)

వీర :- ఏమిటి నన్ను బందిస్తారా !

భూప :- కాదు కౌరవసభలో కృష్ణుని సన్మానంచేస్తున్నాం.

వీర :- అవును ఇది కౌరవసభే కాని వాళ్ళు పురాణాల్లో మిగిలిపోయారు. మీరు నాకళ్ళకదులుతున్నారు. భూపతిరావు ఆనాటి దుర్యోధనునికి జరిగిన పరాభవాన్నయినా గుర్తుకు తెచ్చుకోండి.

భూప :- వీరయ్యా దుర్యోధనుడు కృష్ణుని మాయోపాయానికి కళ్ళుబయర్లు గమ్మి క్రిందపడిపోయాడు. నేనూ నీమాటలునమ్మి భయపడి వదలిపెడతాననుకుంటున్నావా ? ఇక్కడ నువ్వు గింజుకున్నా— గొంతుచించుకున్నా — నీగోడు వినేదిక్కుగాని — రక్షించే నాధుడుగాని— లేడు. పానకాలూ.... ఊఁ కానీ... (పానకాలూ— కరణం మరో అడుగుముందుకువేస్తారు. పాపయ్య గుమ్మందగ్గర అడ్డంగా నిలబడివుంటాడు. వీరయ్య పారిపోబోతాడు. కాని ఇంతలోనే కనకయ్య పానకాలు వీరయ్యను చుట్టుముట్టేస్తారు. వీరయ్యను పట్టుకొని కుర్చీకి కట్టివేస్తారు. నలుగురూ తృప్తిగా నవ్వుకుంటారు. పూజారి పాపయ్య బ్రాందీగ్లాసుల్లోపోసి అందరికి అందిస్తాడు. అందరూ నవ్వుకుంటూ ఛీర్ చెప్పుకొని ఒక్కగుక్క వేస్తారు.)

భూప :- వీరయ్యా ! ఇప్పటికైనా తెలిసిందా మాతో పంతంపడితే ఫలితమేమిటో.

వీర :- ఇప్పటివరకూ ఎవరో చెపుతూవుంటే వినేవాడిని ఈరోజు స్వయంగా చూస్తున్నాను మీ రాక్షసత్వం.

భూప :- (మరోగుక్క వేసి వీరయ్య ముఖంమీద కొడతాడు) నా అంతస్తేమిటి ? నీతాహతేమిటి ? నాకొడుకును నీకూతురు ప్రేమిస్తుందా ! నువ్వు వాణ్ణి వెంటేసుకుని ఎన్నికల ప్రచారం సాగిస్తావా ? నామీద వాణ్ణి పోటీగా నిలబెడతావా !

కన :- (బ్రాందీ వీరయ్య ముఖంమీదవుమ్మేసి) ఒక కులం తక్కువ దానికి ఈ భవనంలో స్థానం కల్పిస్తావా ?

పాప :- నా మాన్యంలో ఇళ్ళుకట్టిస్తావా !

పాన :- ఇంతటితో ఊరుకుంటే ఏమైనాచేస్తాడు ఏకీలుకాకీలు విర గొట్టాల్సిందే....

(అందరూ తిరిగి మరోగుటకవేసి నవ్వు కొంటూవుంటారు. ముందుగా గుమాస్తా గురవయ్య వెనక విజయవస్తారు విజయ తండ్రినిచూసి కంగారు పడుతుంది)

విజ :- ఏమిటిది ఏం జరిగిందినాన్నా ?

వీర :- అమ్మా ! విజయా ! ఇక్కడి కెందుకొచ్చావమ్మా.

విజ :- నీకు ప్రమాదం జరిగిందనిచెప్పి గురవయ్యగారు తీసు కొచ్చారు....ఏమిటిదంతా ?

గుర :- ఇది ప్రమాదంకాక మరేమిటమ్మా !

వీర :- పిల్లలుగలవాడివి నీకిది ధర్మంకాదు.

గుర :- పిల్లలున్నారు గనుకనే ఈ బాధలన్నీ.

విజ :- మానాన్న నెందుకు బంధించారు ?

భూప :- కావాలని మేమేం కష్టేయలేదు. చెప్పినట్లువింటే ఇప్పుడే వదిలేస్తాము.

విజ :- ఏమిటి మీరు చెప్పేది.

భూప :- రాజేష్‌ను పోటీనుంచి ఆపించమన్నాం.

విజ :- రాజేష్ పోటీచేస్తే మీకొచ్చిన నష్టమేముంది. మీరుగెలుస్తారని మీకు నమ్మకముందిగా !

భూప :- నేను ఓడిపోతానని భయపడికాదు.

విజ :- మరి ?

పాన :- తండ్రి కొడుకుల పోటీ బావుండదని.

కన :- పరువుకోసం బ్రతికేవాళ్ళం ఇదే జరిగితే ఇక మా పరువే ముంటుంది.

పాప :- నువ్వయినా చెప్పు. ఇది మంచిపనికాదని.

వీర :- ఇదంతా మనలాంటి పేదవాళ్ళను దోచుకోవటానికి పన్నిన పన్నాగమమ్మా వీరు తలపెట్టిన యజ్ఞంలో నన్ను బలిపశువుగా మార్చాలని ఎత్తువేస్తున్నారమ్మా.

పాప :- ఒరే! వీరయ్యా తాగావాఏమిటి ? అతిగా వాగుతున్నావు ?

విజ :- అధికారముందిగదా అని నాన్నను బంధించారు. డబ్బుందిగదా అని త్రాగుతున్నారు. గొర్రెలెప్పుడూ కసాయివాణ్ణే నమ్ముతాయి. అలాగే వీళ్ళు మిమ్మల్ని నమ్ముకొని ఇలాంటి దారుణాలు చేస్తున్నారు.

కన :- అయితే మేం గొర్రెలమంటావు.

విజ :- వాటికి మంచీచెడు తెలుస్తుంది. అదిలిస్తే అదులుతాయి. మీరలా కాదు. ఈ పెద్దమనిషి ఆడించినట్లు తలలాడిస్తూ కీలుబొమ్మలయ్యారు.

పాన :- ఏమేవ్ వళ్ళుదగ్గరపెట్టుకొని మాట్లాడు.

విజ :- లేకపోతే ఏంచేస్తారు.

వీర :- దుష్టులకు దూరంగా వుండటం మంచిదమ్మా. ఈ విషనాగుల నుండి బయటపడు వెళ్ళిపోతల్లీ.

విజ :- నిన్ను తీసుకెళ్ళకుండా నేనెలావెళతాను.

భూప :— అవును..... ఎలావెళ్ళగలవు. నాకుమారుణ్ణి వల్లోవేసుకున్నావు. సరాసరి ఇంటికేవచ్చావు. ఇంకెక్కడికెళతావు.

పాన :— దీన్నిలావెళ్ళనిస్తే రాజేష్‌ను పెళ్ళికూడా చేసుకుంటుంది.

కన :- పెళ్ళిచేసికొని ఆ స్తివాటాకూడా కావాలంటుంది.

పాప :- దీన్ని వదిలెయ్యటం మనలాంటి మంచివాళ్ళ లక్షణంకాదు.

వీర :- భూపతిరావుగారూ! మీకిది న్యాయంకాదు.

భూప :- న్యాయం – అన్యాయం. ఇప్పుడు మాకళ్ళముందు కనుపిస్తున్నది కన్నెపిల్ల......... పానకాలూ.... ఊ.... కానీ.

పాన :- (విజయకేసి ఒక్క అడుగుముందుకువేస్తాడు)

విజ :- పానకాలూ.... అడుగు ముందుకువేశావా మర్యాద దక్కదు.

పాన :- ఏం ఏంచేస్తాం.........(అనివెళ్ళి విజయ చెయ్యి పట్టుకుంటాడు)

విజ :- వదులు వదులు [అని విదిలించుకొని పారిపోబోతుంది. కరణం కనకయ్య పూజారి పాపయ్య ఎదురుగావచ్చి నిలబడతారు. నలుగురి మధ్యన విజయ వుంటుంది. పానకాలు చెయ్యి వదలి చీరకొంగు పట్టుకొంటాడు. కరణం కనకయ్య జాకెట్టు చించుతాడు. పూజారి పాపయ్య వెళ్ళి సీసా తీసుకుంటాడు. ఇంతలో వీరయ్య విజయా అని పెద్దగా అరుస్తాడు. పూజారి పాపయ్య తూలుతూవచ్చి కుర్చీ తన్నుతాడు. కుర్చీతో సహా వీరయ్య పడిపోతాడు. పూజారి కుర్చీమీద కూర్చునివుంటాడు. భూపతిరావు వెళ్ళి విజయ జడపట్టుకొని లేవదీస్తాడు. ఒక్కసారిగా నవ్వుకొని విసరివేస్తాడు. నలుగురూ విజయను ముద్దుపెట్టుకోవాలని దగ్గరకు వెళ్ళుతుంటారు. విజయ భయంతో కంపించిపోతూవుంటుంది. ఇంతలో రాజేష్‌వస్తాడు. అతన్నిచూచి

అందరూ విజయను వదిలేస్తారు. విజయ ఒక్కసారిగా రాజేష్ వెనుకకువచ్చి నిలబడుతుంది. రాజేష్ కోటుతీసి ఆమెపై కప్పుతాడు.]

రాజే :- మీరు మనుషులా—పశువులా ?

పాన :- ఏదనుకుంటే అదే....

భూప :- ముందుగా ప్రేమించింది నిన్నే. నువ్వు లేకుండా మజా చెయ్యాలనుకోవటం మాది తప్పే నువ్వురా.

రాజే :- నాన్నా !

భూప :- సరసానికి వరసలేమిటిరా—ఇప్పుడు మనమంతా ఒకటే... రా (విజయదగ్గర కెళ్ళబోతాడు.)

రాజే :- మీరు మనుషులని ఇంతకాలం పొరబడ్డాను. మీబ్రతుకు లింత బహిరంగంగా వుంటాయనుకోలేదు. ఊరంతటికీ పెద్దమనుషులని చెప్పుకొని ప్రజల్ని మోసంచేసి ధనం సంపాదించి మీరు సాగిస్తున్న తెరచాటు భాగవతం ఈ నాటికి ప్రత్యక్షంగా చూస్తున్నాను.

కన :- చాలా సంతోషం. ఇప్పటికైనా తెలుసుకున్నావు.

పాప :- ఇంతత్వరగా తెలుసుకున్నందుకు ఆశీర్వదిస్తున్నాను. (అని సీసా శఠగోపంలాపెడతాడు.)

రాజే :- పాపయ్యగారూ ! చీకటిగదిలో బంధించబడ్డ దేవుణ్ణికాదు నేను. మోసగించటానికి దేవుడిపేరుచెప్పి వున్న మాన్యమంతా నీపేర పెట్టుకొని దేవుని నెత్తిన శఠగోపంపెట్టినట్లు — నానెత్తిన పెట్టాలనుకుంటున్నావు. నీపాపం పండేరోజువచ్చింది.

పాప :- ఈ కులంతక్కువదాని చేతికూడు తిన్నతర్వాత తెలిసిందికాబోలు ఈ నిజం .

రాజే :- మీకన్నా వెయ్యిరెట్లు విజాయితీగా బ్రతుకుతున్నారు వాళ్ళంతా. తెరచాటున మీరు నడుపుతున్న ఈతంతులు తెలియక మీకు సలాములు చేస్తున్నారు. హరిజనుడనీ—అంటరాని వాడని మీఛాయలకు రాకుండాచేసి-మీపనులు నిర్భయంగా సాగిస్తున్నారు. గట్టిగా ఉపన్యాసమిస్తే విప్లవాది అంటున్నారు మీకు ఎదురు తిరిగితే నక్సలైటని జైల్లో పెట్టిస్తున్నారు. ఈ వీరయ్యలాంటి వాళ్ళనుకట్టేసి మీపనులు సాగిస్తున్నారు. నవసమాజ నిర్మాణానికి విజయలాంటి విప్లవరత్నం ఒక్కటుంటేచాలు. వీరయ్యలాంటి వాళ్ళకోసంకాదు. మీలాంటి వినాయకులకోసం ఈ చట్టాలన్ని తయారవుతున్నాయి.

కన :- మా భూముల్ని అన్యాయంగా ఇవ్వమంటే ఎదురుతిరిగిపోరాడ బోతున్నాం. అంతే.

రాజే :- కరణంగారూ ! ఇవి మీ భూములా ! ఎలావచ్చాయండీ మీకీ భూములు ! మీ తాత సంపాదించాడా ? మీనాన్నా సంపాదించాడా? కరణం అని పేరుచెప్పుకొని ఊళ్ళో కనుపించిన ప్రతి బంజరునూ కబళించి నువ్వూ ఒక భూస్వామివయ్యావు. ఆ భూమి నీదెలా అవుతుంది. దున్నేవాడిదే భూమి కనీసం నీభూమి ఎక్కడెక్కడుందో నీకుతెలుసా ? ఏనాడయినా నీభూమిని నువ్వు సాగుచేశావా ? కవుళ్ళకిచ్చి పేదరైతుల రక్తమాంసాల్నిపిండి, పిప్పిచేసి, ఆ రసంత్రాగి బ్రతుకుతున్నావు నువ్వు సాగు చెయ్యలేనిభూమి నీదెలా అవుతుంది. ఆ పేదవాళ్ళనయినా బ్రతకనీ. ఈనాడు కావలసివచ్చిందా నీ భూమిలెక్క.

భూప :- ఒరేయ్ ! అది మా స్వవిషయం నీకనవసరం.

రాజే :- మరేదవసరం. పంచాయితీబోర్డు పదవిచేత పట్టుకొని ఊళ్ళకు ఊళ్ళే కొల్లగొట్టుకోవటం అనవసరమా ? మీకీ ఆస్తి సంపదా పదవి రాకముందువుందా ? పదవివచ్చింది. పదవితోపాటు పలుకుబడీ పెరిగింది ...ప్రజల ఓట్లతోపాటు వాళ్ళబ్రతుకుల్నీ కొన్నారు. మీరు నష్టపడబోతున్నారని బాగుపడబోతున్న శ్రమ జీవుల్ని ఎందుకు చెరుపుతారు. మీరు మారతారని ఇంతకాలం చూశారు చివరకు ప్రజలే మారారు.....వెల్లువవస్తేగాని మిట్టా— పల్లాలేకంకావు.........లెనిన్ మహాశయుని విప్లవబీజాలు, వీర వియత్నాంలో మొక్కలుగామారి....నేటి సమాజంలో మహా వృక్షాలైనాయి. వాటివేరులు సూటిగా నాటుకుపోయి. అధికార మనే మీ భవంతుల పునాదులను కదిలించివేసే అమృతఘడియ రాబోతుంది. నవసమాజ నిర్మాణం జరుగబోతోంది....దానికి ఎదురుతిరిగితే ప్రజలే తగిన శాస్తిచేస్తారు.

భూప :- ఈ నీతులు చెప్పటానికేనా పోటీ వెలగబెడుతున్నది;

రాజే :- కాదు... నన్ను మీ అన్యాయాలే పోటీకి పురిగొల్పాయి. మీ అక్రమాలే చేదోడునిచ్చాయి. మీ మారణహోమంలో దహించుకు పోయిన శలభాలే ధైర్యానిచ్చాయి. ఉరకలువేస్తూ ముందు కురుకుతున్న ప్రజావాహినిని ఆపటం నీతరంకాదు. ఆ ప్రజలే సోషలిజంతెస్తారు. అందులో ధనికా— పేదా తేడావుండదు. పండించేవాడిదే — భూమి — ఉండేవాడిదే ఇల్లు — మీలాంటి దగాకోరు నాయకులు కరణం లాంటి కామందులు పూజారిలాంటి నమ్మకద్రోహులు సమూలంగా నాశనమయ్యేరోజు ఇంకా ఎంతో దూరంలేదు.

కన :- మాకు ప్రతిపక్షంలోవుండి ఇంతకన్నా గొప్ప ఉపన్యాసాలిచ్చినా నిన్నెవరూ మెచ్చుకోరు .. కాగితాలు మైకులు దండగతప్ప.

రాజే :- కనకయ్యగారూ ! నేను మీకు ప్రతిపక్షంలో వుంటాననటంలేదు. పేదల ప్రతినిధిగా పోటీచేస్తున్నాను. (వెళ్ళి వీరయ్య కట్లు విప్పుతాడు ) పదండి. విజయా పద.... ...ఈ నరకంలో ఒక్క-క్షణం వుండకూడదు. (అడుగు ముందుకువేశాడు)

భూప :- రాజేష్ ఆగు ... !

రాజే :- (ఆగాడు)

భూప :- నువ్వు కాలుబయట పెడుతున్నది ఈ ఇంట్లోనుండికాదు. నా హృదయంనుండి నా ఆస్థిలో నీకు చిల్లిగవ్వ దక్కదు. ఆలోచించుకు మరీ కాలుముందుకు వెయ్యి

రాజే :- హృదయంలేని నిన్ను నాన్నని చెప్పటంకన్నా. లేడనుకొని కష్ట సంపాదించి ప్రశాంతంగా దూరంగా వుండటమే మంచిది.

భూప :- ఇదే ఆఖరి జవాబా ?

రాజే :- అంతేకాదు. నాప్రాణముండగా తిరిగి ఈ ఇంట్లో కాలుపెట్టనని చెప్పి మరీ వెళుతున్నాను.

వీర :- రాజేష్‌బాబూ ! ఒకరోజున విజయను మీరు పెళ్ళిచేసి కొంటా నంటే అభ్యంతరంచెప్పాను. కాని ఈనాడు మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. ఎందుకో తెలుసా ఈరోజున విజయ భర్తగా పొందుతున్నది భూపతిరావు కుమారుణ్ణికాదు. పేదల పాలిటి పెన్నిధిని....వియ్యమైనా కయ్యమైన సాటివారితోనే సరి తూగగలం బాబు.

విజ :- నాన్నా........

[ నేపథ్యంలో పాట ]

సాకి :— కసిరిందా — కలిమినిన్ను
విసిరిందా — విధికూడా
మనసేలేని — మనుషులలోనా
మమతేకరువై — బాధేమిగిలి
వేదనరగిలి — ఆవేదనతో
వెళుతున్నావా — ఒంటరిగా
జాలేలేని — లోకంలోనా ।
దారేలేని — వాడవై
ఏమో తెలియక
ఏదోచేయాలని
బ్రతుకుతున్నావు — బరువుగా ।

(కనకయ్య — పాపయ్య — పానకాలు మూడు కుర్చీల్లో కూర్చుండిపోతారు. భూపతిరావు మధ్యన నిలబడివుంటాడు)

తెర

—o—

## మూడవ రంగం

### "Lights off"

(బయట జనంగోల—ఈలలు. గందరగోళంగా వుంటుంది. ఇంతలో A Special anounsment ముఖ్యప్రకటన — ఈ నియోజక ఎన్నికల ఫలితాలు–

మొదటి లెక్కింపు –

భూపతిరావు – 4000 ఓట్లు

రాజేష్ – 3400 ఓట్లు

రెండవ లెక్కింపు –

భూపతిరావు – 6000 ఓట్లు

రాజేష్ – 4000 ఓట్లు

మూడవ లెక్కింపు –

భూపతిరావు – 3000 ఓట్లు

రాజేష్ – 6000 ఓట్లు

నాల్గవ లెక్కింపు –

భూపతిరావు – 1500 ఓట్లు

రాజేష్ – 5500 ఓట్లు

("శాసనసభకు నాలుగువేల నాలుగు వందల ఓట్లు మెజారిటీతో రాజేష్ ఎన్నిక"
బయట జనంగోల తారాస్థాయి నందుతుంది. తప్పెట్లు వాయిద్యాలమోతలు అరుపులు విపరీతంగా వినవస్తుంటాయి.)

—: Lights on :—

(లైట్లు వెలిగేసరికి నలుగురు మనుషులు రాజేష్‌ను భుజాలపై ఎక్కించుకొని పూలమాలలువేసి మోసుకొనివస్తారు.... దూరంగా కోరస్ పాట వినబడుతూవుంటుంది.)

నీవిజయం — ఘనవిజయం
నీధ్యేయం — అమరం
అదే — శాంతిసమరం
సోషలిజానికి — నాంది.
స్వార్థపరుల కశాంతి
భూస్వాముల కదిపిశాచి
కష్టజీవుల కదే — విముక్తి
నవయుగానికే — పునాది
దగాకోరులకదే — సమాధి
సజీవ సమాధి.

(పాట జరుగుతూవుండగా నలుగురైదుగురువచ్చి పూలదండలు వేసి వెళుతుంటారు. పాట ఆగిన తరువాత కనకయ్య — పాపయ్య—పానకాలు ముగ్గురూ మూడు పూలదండలు తీసుకొని వొస్తారు)

ముగ్గురూ :- నమస్కారం...

రాజే :— (తిరిగి నమస్కారం చేస్తాడు)

పాప :— తమర్ని .......ఏది.......తమ దివ్యమంగళరూపాన్ని ఒక్కసారి దర్శించుకుపోదామని.

కన :— తమ ఘనవిజయాన్ని ఈ ఆరుకళ్ళతోచూసి పోదామని వచ్చాం.

పాన :— మనఊరి ప్రజల తరుపున శుభాకాంక్షలందజేద్దామని వచ్చాం.

పాప :— మీ ముఖంలో—ఆరీవి—అదర్జా నేముందుగానే అనుకున్నాను మీరే గెలుస్తారని.

కన :—జ్యోతిష్యం చెప్పినట్లు చెప్పానుగదండి మీనాన్నగారికి పోటీవద్దు—ఓడిపోతారని.

పాన ;- అయినా మీకున్న పలుకుబడి మీనాన్నగారికెక్కడిదిలెండి.

రాజే :- అయితే మీరు పనిగట్టుకువచ్చింది నన్ను పొగడటానికన్నమాట.

పాప ;- ఎంతమాట....అది మాజన్మతో వచ్చిన బుద్ధిగదండీ.

కన ;- మీముందు చెప్పకూడదుగాని-పంచాయితీ సొమ్మంతా దిగమింగాడు గదండీ.

పాన :- బకాసురుడులా ప్రజల్ని బలితీసుకున్నాడు గదండీ.

పాప ;- మీదగ్గర దాపరిక మెందుకుగాని.....శ్రీరామనవమికి పోగుచేసిన చందాలో ఆయనకూ సగం భాగం ఇచ్చేవాణ్ణా.

కన :- నేను.....వరదబాధితులకు పంచిపెట్టమని వెయ్యి బియ్యపు బస్తాలు పంపిస్తే రెండవకంటివాడికి కనిపించకుండా మూడు వందల బస్తాలు పంపిచానా !

పాన :- నామర్డర్ కేసు మాపుచేయించినందుకు పాతికవేలు ఇచ్చుకున్నానా-

పాప ;- దేవాలయాలు కట్టించమంటే - మండపాలతోనే పని ముగించానా ? దేవుడిమాన్యంలో ఆయనకూ సగం భాగం ఇచ్చానా ?

కన :- నేను మాత్రం ఊరుకొన్నానా ? ఊరవతలదయ్యాల తోపులో ఆయనకూ వందెకరాలు పంచిపెట్టాను గదండీ.

పాన ;- ఎరువుల్లో ఎర్రమన్ను కలిపి అమ్మిపెట్టానా ? ఆయన సమితి ప్రెసిడెంటుకావాలని పదిమంది పంచాయితీబోర్డు ప్రెసిడెంటుల్ని

రెండో కంటికి కనుపించకుండా దాచిపెట్టానా.......మమ్మల్ని మరచిపోయాడండి.

పాప :- మాట నిలుపుకోలేని మనిషండీ.

కన :- మర్యాద తెలీనిమనిషికదండీ....చేసినమేలు మరచిపోయాడు.

రాజే :- అయిందా మీ దండకం. ఇంకేమయినా మిగులుందా ?

పాప :- ఏది.....అసలు విషయానికి రాందే.

రాజే :- ఏమిటది ?

కన :- మీరు చేస్తామని మాటివ్వాలి.

పాన :- తప్పక మమ్మల్ని కనికరించాలి.

పాప :- ఆజన్మాంతం ఆకుపూజ చేయిస్తాను.

కన :- మీరు తలుచుకుంటే కాని పనేమీకాదు.

పాన :- ఈ విషయం మీనాన్నగారి హయాంనుండి నానుతుంది.

పాప :- మీపాలనలో చేసితీరాలి.

రాజే :- అనవసరమైన ఉపన్యాసంమాని అసలు సంగతిచెప్పండి.

కన :- ఏముందడీ....మాముగ్గురికీ ఇంతకాలానికికాక మంచిబుద్ధి పుట్టింది.

పాన :- మూడు మంచివ్యాపారాలు పెట్టుకోవాలనే కోరిక కలిగింది.

పాన :- ఈ వస్త్రాలమీద ఆశచావకనాకు నూలుమిల్లు కట్టించాలనే సరదాగా వుందండీ.

కన :- నాకు జనపనార మిల్లుమీదే మోజుగావుందండీ.

పాన :- ఎంతయినా రైతుపుట్టుక పుట్టాను పొగాకు కంపెనీపెట్టి విదేశాలు చూసి రావాలనే తాపత్రయంగా వుందండీ.

పాప :- ఎలాగయినా వీటికి....సైలెన్సులు....అదే లైసెన్సులు తెచ్చి పెట్టాలి.

రాజే :- మొత్తానికి గట్టి పథకాన్నే తయారుచేశారు.

కన :- ఎంతయినా కరణాన్ని కదటండీ........ఆమాత్రం పగడ్‌బందీగా తయారుచెయ్యనిదే గట్టితనమేముంటుంది.

రాజే :- రాబోయే భూసంస్కరణలనుండి తప్పించుకోవటానికి పన్నిన పన్నాగ మన్నమాట.

పాప -; అమ్మమ్మ....అంతమాటనకండి.

రాజే :- ఇప్పటివరకూ పదవి మీచేతిలో వుందని – ఇష్టంవచ్చినట్లు పరిమిట్లు తెచ్చుకొని – తప్పుడు లెక్కలు చూపించి ప్రజల్ని – ప్రభుత్వాన్ని వంచించారు. ..నేను పదవిలోకి వచ్చింది. మీలాంటి దగాకోరుల తప్పుడు లైసెన్సులు రద్దుచేయించటానికే.

కన :- బాబూ ! మాగుట్టు బట్టబయలుచేయకు.

పాన :- మీకష్టం వుంచుకోము.

పాప :- ప్రతిఫలం ముట్టచెపుతాం.

(ఇంతలో విజయ లోపలనుండి వస్తుంది.)

కర :- సమయానికి వచ్చారు. అదృష్టమంటే నీదేనమ్మా.

పాన :- ఇలాఇంట్లో కాలుపెట్టావోలేదో — అలాఅబ్బాయి M.L.A ఐకూర్చున్నాడు.

పాప :- ( జేబులోనుండి నెక్లెస్‌తీసి) అమ్మగారికి ఎంతో బావుంటుందని ఊరంతాతిరిగి మరీకొనుక్కొచ్చాను.

విజ :- పాపయ్యగారూ !

కర :- ఇదిగోనమ్మా ధర్మవరం పట్టుచీర కట్టుకుంటే ఇంద్రలోకంలో వుండే... రంభా–మేనకలకన్నా మిన్నగా వుంటారు. (చీరతీసి ఇవ్వబోతాడు)

పాన :- ఇటుచూడు తల్లీ....రవ్వలగాజులు.... వజ్రాలు పొదిగించి మరీ పట్టుకొచ్చాను. కాదనకమ్మా....

పాప :- కనికరించాలి తల్లీ.

ముగ్గురూ :- ఇవిగో తీసుకో . . . (అని చుట్టూ తిరుగుతూవుంటారు)

విజ :- ఆపండి . . . ఏమిటీ వెర్రివేషాలు . . . మీరు మనుషులా రాక్షసులా . . . సిగ్గులేక . . . లంచం తీసుకొని బయలు దేరారన్నమాట.

కన :- ఇది లంచంకాదు—కానుక—

పాన :- పారితోషికం.

పాప :- ఎన్నికల్లో గెలిచినందుకు బహూమానం.

రాజే :- మీభాషలో ఇది ఏదైనా కావచ్చును. నాకుమాత్రం లంచం. ఇంత కాలం — ఈ లంచాలిచ్చి పుచ్చుకొని — పాపపు సంచులను మూటగట్టుకున్నారు. ఒకమాటమాత్రం గుర్తుంచుకోండి. ప్రజలంతా మీలాగే స్వార్ధపరులైతే ఈదేశంగతి ఏమవుతుంది— తుపాకి గుండ్లకుగురియై — బలిదానాలనిచ్చి సంపాదించిన స్వాతంత్ర్యం ఎన్నాళ్ళు నిలుస్తుంది . . . వందల ఎకరాలు మీ చేతుల్లోనేవుంటే - అంతస్థులమీద అంతస్థులు మీరే పెంచుతూ వుంటే - రెక్కాడితేగాని - డొక్కాడని నిరుపేదల బ్రతుకు లేంకావాలి. వారి ఆకలి ఆక్రందనలు మీకు వినిపించవా ? స్వార్ధాన్ని వీడండి - పట్టెడన్నాన్ని పదిమందికి పంచటానికి ప్రయత్నించండి.

విజ :- మీ మాటలకు మారేమనుషులుకారు వీరు. కరుడుకట్టుకొనిపోయిన దానవత్వం వీరిలో పేరుకుపోయింది. అది కరగనంతవరకూ మనమెన్నిచెప్పినా చెవిటివానిముందు శంఖంఊదినట్లే అవుతుంది.

రాజే :- మీరు మారాలి . . . తప్పదు . . . మారకపోయినా మార్పించే చట్టాలు తయారవుతున్నాయి. ప్రజలు చైతన్యవంతులయ్యారు... బలవంతంగానైనా మారుస్తారు. దౌర్జన్యాలు జరుక్కముందే - దారుణాలు కళ్ళారా చూడకమునుపే మంచిగా మనసు మార్చుకోండి.

(వీరయ్య బయటనుండి వస్తాడు)

వీర :- మీరంతా ఇక్కడున్నారా ?

విజ :- ఏంజరిగింది నాన్నా !

వీర :- జరగకూడనిదే జరిగిందమ్మా. . .వీరి రాక్షసత్వం రోజు రోజుకీ మితిమీరిపోతోంది.

పాన :- ఏం జరిగింది వీరయ్యా !

వీర :- ఎంత తెలియనట్లు నటిస్తున్నారు ఆనారిగాడిచేత రామయ్య ఇల్లు తగలబెట్టించింది మీరుకాదూ ?

ముగ్గు :- మేమా !

వీర :- అవును మీరే! . . . ఎన్నికల్లో ఓడిపోయామనే ఉక్రోషంతో నారిగాణ్ణి పిలిపించి—తప్పతాగించి పచ్చనోట్లు చూపించి ఆ ఇల్లు తగులబెట్టించారు. మారణహోమానికి బలైపోయింది ఎవరో తెలుసా ! అన్నెం పుణ్యం ఎరుగని రామయ్య నలుగురుపసి బిడ్డలు. ఆ మంటల్లో మాడిపొయ్యారు.

విజ :- ఎంతపనిచేశారు ? మీకు పిల్లలున్నారు—తల్లులున్నారు—ఇవి మనుషులు చేయవలసి పనులేనా ? ఆ పసికందులు అనుభవించిన యమయాతన తలుచుకుంటేనే హృదయం కరిగిపోతుంది. మీది హృదయమా ?— పాషాణమా ?

వీర :- పారిపోతున్న నారిగాణ్ణి ప్రజలు పట్టుకొన్నారు. వాడిచేత నిజం చెప్పించి – ఆ మంటలకే వాణ్ణి బలిచేశారు. అంతటితో . . . ఆకలికొన్న ఆ ప్రజావాహిని మీకోసం – భూపతిరావుకోసం ఊరంతా గాలిస్తున్నారు.

పాప :- ఓరి . . దేవుడో ఇప్పుడేంచెయ్యాలి.

రాజే :- కట్టకట్టుకుని గోదావరిలో పడండి.

కన :- రాజేష్‌బాబూ ! బుద్ధిగడ్డితింది ఇంకెన్నడూ ఇలాంటి పనులు చెయ్యం రక్షించు.

పాన :- ఆ జనానికి దొరికితే మా జాయింట్లు ఊడదీస్తారు . . .కాపాడు బాబూ !

వీర :- వీల్లేదు . . . మీలాంటి నమ్మకద్రోహాల్ని విడిచిపెట్టటానికి వీల్లేదు. వీరి ఆక్రమాలకు హద్దుల్లేవు. బ్యాంకుల ఋణాలను వీరి వందల ఎకరాలకు దారుణంగా పీల్చేస్తున్నారు. బియ్యాన్ని గిడ్డంగుల్లోదాచి బ్లాకులో అమ్మిస్తున్నారు. ఎదురుతిరిగి మాట్లాడితే రౌడీలచేత హత్యలుచేయించి మాపుచేయిస్తున్నారు . . . ఇక వీళ్ళు బ్రతకటానికి వీల్లేదు.

పాప :- వీరయ్యా ! ఈ ఒక్క తప్పుకు క్షమించండి.

వీర :- నేనిప్పుడే పోలీసులకు ఫోనుచేసివస్తాను.

ముగ్గురు :- వద్దు వీరయ్యా – వద్దు.

విజ :- నాన్నా – నువెళ్ళు – (వీరయ్య బయటికి వెళతాడు బయట జనం గోలవినపడుతూ వుంటుంది)

కర :- అదిగో బాబూ ! వచ్చేస్తున్నారు ... మా నూరేళ్ళ బ్రతుకులు మంటకలిసిపోతాయి.

రాజే :- ఆ మంటలలో కాలిపోయిన పసిప్రాణలకంటే ఎక్కువేంకాదు- మీ ప్రాణాలు.

పాన -: మీరూ అలాగే అంటే – ఈ ఊళ్లో మమల్ని కాపాడేవాళ్ళెవరు ?

(అని ముగ్గురూ రాజేష్ పాదాలమీద పడతారు)

రాజే :- లేవండి....చేతులుకాలిన తరువాత ఆకులు పట్టుకుని ఏం లాభం. జరగవలసింది జరుగక మానదు.

విజ :- ఈబుద్ధి మొదటినుండీ వుంటే ఇలా కాళ్ళబేరానికి రావలసిన ఖర్మంపట్టేదా.

(ముగ్గురూ మెల్లగాలేస్తారు. ఇంతలో భూపతిరావు దొడ్డివాకిలి గుండా పరుగెత్తుకొస్తాడు. చేతిలో బ్రీఫ్‌కేస్ వుంటుంది.)

భూప :- ( ముగ్గుర్నీచూసి) మీరు ఇక్కడున్నారా ?

రాజే :- నాన్నా !

పాన :- ఎవరూ ? భూపతిరావుగారా ?

పాప :- మీరు చేయించిన ఘనకార్యానికి ఇంకెక్కడుంటాం ?

భూప :- నేనేం చేయించాను.

కన :- ఎంత తెలీనట్లు నటిష్తున్నారు.

భూప :- నాకేం తెలీదు ....మీకు పిచ్చిపట్టిందనుకుంటాను.

పాన :- అవును మాకు పిచ్చిపట్టే ఇంతకాలం నీచేతిలో కీలుబొమ్మల మయ్యాం.

భూప :- మర్యాదగా మాట్లాడు.

పాప :- ఇంతదాకా వచ్చినతరువాత మర్యాదేమిటి ? రామయ్య ఇల్లు తగలబెట్టించటానికి ప్లాను తయారుచేసింది నువ్వుకదూ !

భూప :- దగ్గరుండి చేయించింది మీరుకదూ.

రాజే :- మీరందరూ ద్రోహులే....పాపాన్నికూడా ఆస్తిలా పంచుకున్నారు

భూప :- ఆ స్తంటే గుర్తొచ్చింది ముందీపెట్టె తీసుకో.

రాజే :— ఏమిటది ?

భూప :— నీకు చెందవలసిన ఆ స్తిమొత్తం ఇందులోవుంది. సందేహించక తీసుకో.

రాజే :— మీ ఆస్తితో సంబంధం లేదని ఏనాడో చెప్పాను.

భూప :— ఆనాడు కాదన్నా—ఈనాడు తీసికోకతప్పదు.

రాజే :— ఎందుకని.

భూప :— కాదని కాలదన్నకు — దారి వెతుక్కుంటూవచ్చాన్రా....

రాజే :— వెతుకుతూ వెళ్ళితే ఎన్నోదారు లొస్తాయి. ముళ్ళకంచెలూ వుంటాయి — మల్లెపొదలూ వుంటాయి జాగ్రత్త.

కన :— ఎక్కడయినా మొగలివాసన కోసం మిన్నాగొస్తుందండీ....

రాజే :— కరెక్టు చాలా బాగాచెప్పారు. నా పదవనే నాగస్వరానికి పడగ విప్పుతూ — బుసలు కొడుతూ ఏక్షణానైనా మీరు వస్తారని నాకు బాగా తెలుసు

పాన :- ఇప్పుడు మేం బురదపాములై నీదగ్గర వున్నాంబాబూ!

భూప :- నా రెండుచేతులు చాచి అర్థించటానికి వచ్చాను.

రాజే :— వాట్ కత్తిపట్టకుండానే — కార్యరంగం చూడకుండానే — ఎన్నో హత్యలు అవలీలగా జరిపించిన మీ చేతులు — నా ముందు అర్థించటానికి వచ్చాయా! ఇంపాజిబుల్.

విజ :— పదవిని చూసుకొని విర్రవీగి త్రాగిన మైకంలో కళ్ళుకానక — ఒళ్ళుమరచి-ఒంటరి ఆడదాన్ని మీ కబంధహస్తాల్లో నలిపివేసిన నాడేమయిందీ మంచితనం.

పాన :- ఎంతయినా రక్తసంబంధంలే బాబు.

రాజే :- అది ఏనాడో తెగిపోయింది.

భూప :- తెంచుకుంటే తెగిపోవటానికి దారపుముక్క కాదురా అది.... రక్తసంబంధం.

రాజే :- రక్త....సం....బంధం ఎలావుంటుందది ? మీకుపోటీగా నిలబడుతున్నానని, కట్నంరాని పెళ్ళి చేసుకుంటున్నానని రిక్తహస్తాలతో ఇంటినుండి వెడలగొట్టిన నాడేమయింది రక్తసంబంధం.

విజ :- రౌడీలచేత పూరిగుడిసెలకు నిప్పటించిననాడు సమాస్తాన్నీ కోల్పోయి, తమబిడ్డల ఆకలి ఆక్రందనలు వినలేక – వారి బాధలను చూడలేక. ఆ మంటలలో నేదూకి ఆత్మాహుతి చేసుకొన్న తల్లులను చూస్తూ నవ్వుతూ నిలబడ్డనాడేమయిందీ నిస్సహాయత.

భూప :- అమ్మాయ్.... ఇది మా స్వవిషయం....

రాజే :- ఇది వారిఇల్లవి మాత్రం మర్చిపోకండి భూపతిరావుగారూ !

భూప :- ఒరేయ్ ! ఎంత తెగించావురా ? ఈ నీతులు చెప్పటానికేనా నిన్ను చదివించింది.

రాజే :- చదివించింది స్వార్థంతోనని నాకు తెలుసు.

భూప :- పోలీసులు మన ఇంటిని సోదాచేశార్రా.

రాజే :- మీ ఇంటిని కాక....నా ఇంటిని సోదాచేస్తారనుకున్నారా ?

విజ :- ఇంతకాలానికొక మంచిపని జరిగిందన్నమాట.

భూప :- అండర్ గ్రౌండులోవున్న దొంగనోట్లతో సహా—మిషన్ కూడా వాళ్ళ స్వాధీనమయిందిరా.

కన :- ఏమిటీ మిషనుకూడానా !

భూప :- మన అందరి ఇండ్లల్లోనూ సోదాచేశారు .... దొంగనోట్లన్నీ పట్టుకున్నారు.

పాప :- ఓరి దేవుడో.... ఇప్పుడు నేనేంచెయ్యాలి.

విజ :- సరాసరి పోలీస్ స్టేషనుకెళ్ళి తప్పులన్నీ ఒప్పుకోవాలి.

పాన :- రాజేష్‌బాబూ! మమ్మల్ని కాపాడు .... నా మనవడికి నీపేరు పెట్టుకుంటాను.

రాజే :- చూశారా....మీరుచేసిన ఒక్కొక్కనేరం కాలనాగుగామారి ఎలా కాటేయ్య బోతున్నాయో.

భూప :- నేరాలు చేశాన్రా....ఇంతకంటే ఘోరాలేచేశాను....ఎవరికోసం.. నీకోసం నీ అంతస్థు పెంచటంకోసం....చేశాన్రా.

రాజే :- నా అంతస్థు పెంచటంకోసం....ఎన్నో వేలమంది అంతస్థులను నిలువునా కూల్చేశావని నిర్భయంగా చెప్పటానికి సిగ్గులేదూ.

భూప :- అదేవుంటే ఇంతవాణ్ణేలా అయ్యేవాణ్ణి....పరువూ మర్యాదలతో సహా ... నా జీవితమే నాశనమవబోతోంది.

అదిగో జనం వచ్చేస్తున్నారు ... ఈ ఊరంతటిలో నీ ఇంట్లో తప్ప నాకు వేరేచోట శరణు లభించదు ... కాదనకు.

(బయట జనం అరుపులు గోల వినబడుతుంది.)

పాప :- వాళ్ళచేతికి దొరికామా ... పిచ్చికుక్కల్ని చంపినట్లు చంపేస్తారు కాపాడుబాబూ!

కన :- ఎంతయినా కన్నతండ్రి—కనికరించు.

పాన :- పదవిపోయినా—ఆస్తిపోయినా సంపాదించుకోవచ్చు ...కన్నతండ్రి కరువయితే జీవితాంతం శాంతివుండదు.

పాప :- తండ్రిని చంపించిన తనయుడన్న అపకీర్తి పాలవుతావు ... ఆలోచించుకోబాబూ! (రాజేష్ ఆలోచనలో పడతాడు ...)

భూప :- అమ్మాయ్! విజయా! నువ్వయినా చెప్పమ్మా....ఆడవాళ్ళ హృదయం నవనీతం అంటారు. హింసనుచూస్తూ నిలబడలేని కరుణామయులంటారు.... నువ్వయినా కాపాడు .... (రాజేష్‌తో) నేనే పదవిలో వున్నట్లయితే దొరికినవి దొంగనోట్లుకాదు. చెత్త కాగితాలని క్షణాలమీద ఫోనుల్లో తేల్చేద్దును.

పాన :- అంతదాకా ఎందుకు మొన్నీమధ్య మాఇంట్లో రెండు కిలోల బంగారం దొరికితే ఇత్తడిముక్కలని ఋజువు చేయించారు మీ నాన్నగారూ.

(బయట జనంగోల)

1 వ గొంతు :- రాజేష్ పదవిరాగానే స్వార్థపరుడయ్యాడు.

2 వ గొంతు :- దేశద్రోహి అయిన తండ్రికి ఇంట్లో స్థానం ఇచ్చాడు.

3 వ గొంతు :- ప్రజాకంటకులను ఇంట్లో పెట్టుకుని నాటక మాడుతున్నాడు.

4 వ గొంతు :- రాజేష్‌బాబూ ! మర్యాదగా వాళ్ళను బయటకుపంపు లేదా ఏ ప్రజలైతే నీకుపూలదండవేసి సన్మానించారో ఆ ప్రజలే నీనాశనాన్ని కళ్ళారాచూస్తారు.

రాజే :- [పెద్దగా] వీల్లేదు....స్వార్థపరులకు—దగాకోరులకు నిలయంగా నా ఇల్లు మారటానికి వీల్లేదు . . . ముందు బయటకు వెళ్ళండి.

(వీరయ్య బయటనుండి కంగారుగా వస్తాడు.)

వీర :- రాజేష్‌బాబూ ! వీళ్ళను ఒక్కక్షణం ఇక్కడ వుండనియ్యకండి. బయట జనం రెచ్చిపోతున్నారు. ఆవేశంలో ఏంచేసినా చేస్తారు.

భూప :- వీరయ్యా .... ఇదినీకు న్యాయంకాదు. కన్నకొడుకు చేతుల మీదుగా తండ్రిని బలి ఇప్పించబోతున్నావు.

వీర :- న్యాయాన్యాయాలను గూర్చి యోచించే సమయంకాదిది. రానున్న ఆపదనుండి బ్రతికి బయటపడే ఆలోచన చూడండి.

విజ :- నాన్నా...పాముకు పాలుపోసిపెంచినా...ఏదో ఒకనాటికి కాటు వేయక మానదు. ఆపదలో ఆదుకున్నా . . . ఆదను తీరాక మానవత్వాన్నే మరచిపోయే మనుషులువీరు. ఇలాంటి కసాయి వాళ్ళకు తగినశాస్తి జరగవలసిందే. (బయట జనంగోల)

రాజే :- చూశారా! మీరు చేసిన తప్పుడు పనులకు శిక్షను మీతో పాటు నేనూ పంచుకోవలసి వస్తుంది. పదవులు మీచేతిలో వున్నాయని —అధికారులు మీచేతిలోవున్నారని ఈ అయిదు సంవత్సరాలు అక్రమాలు జరిపారు - హత్యలు చేయించారు. అయిదు సంవత్సరాలు దాటిపోగానే దొంగకు తేలుకుట్టినట్లు పదవినుండి దిగిపోయారు. మీకాలంలో చేసినఘోరాలు మా కాలంలో బంధాలై కాళ్ళకు చుట్టుకున్నాయి. తండ్రులు చేసినపాపాలు బిడ్డలపాలిటి శాపాలైనాయి. మీరు చేసిన మారణహోమంలో మేము దహించుకు పోతున్నాం. మీ అన్యాయాలు మీతోనే నాశనమవ్వాలి ముందు బయటకువెళ్ళండి.

భూప
కన } రాజేష్‌బాబూ!
పాప

రాజే :- నన్నూ....నా ఆశయాలనునమ్మి తమ పవిత్రమైన ఓటువేసినన్ను గెలిపించారు. ఆ ప్రజలు నమ్మినవారికి ద్రోహం చెయ్యటం నా లక్ష్యంకాదు. ఈ భూసంస్కరణలనుండి తప్పించుకోటానికి మీరెన్ని అక్రమాలు జరిపారు? మనిషి బ్రతకటానికి వేల ఎకరాలభూమి అవసరంలేదు. ఉన్నదాంట్లోనే తృప్తిపడటం నేర్చుకోండి. మీరు ఎంతకాలం మీభూముల్ని దాచుకోవటానికి ప్రయత్నిస్తారో — సోషలిజపు భావాలు అంతకంటే వెయ్యిరెట్లు ప్రజల్లో ఉద్భవిస్తాయి మీరు తప్పించుకుందామనుకున్నా తప్పించుకోలేరు. ఆకలిదప్పులకల్లాడే ప్రజావాహిని తగినశాస్తిచేసి మీ భూముల్ని స్వాధీనపరుచుకుంటారు - జాగ్రత్త!

భూప :- మేం స్వాధీనపరచినా ... మాలాంటివారు వేలాదిమందివున్నారీ దేశంలో.

రాజే -; కోటానుకోట్ల నిరుపేదలు ఏకమయి వెల్లువగామారితే అక్క-
దక్కడా నిలబడ్డ మీలాంటి మానుల్ని అరక్షణంలో నేలమట్టం
చేస్తారు.

పాప :- ఇంకెన్నడూ ఇలాంటి తప్పుడు పనులు చెయ్యం.

కన :- మాకు బాగా బుద్ధిచెప్పారు...లెంపలేసుకుంటున్నాం.

( కనకయ్య, పాపయ్య, పానకాలు లెంపలేసుకుంటారు )

వీర :- మీరు లెంపలేసుకున్నంతమాత్రాన....చేసిన తప్పులు మాసిపోవు
మర్యాదగా పోలీసులకు లొంగిపొండి.

పాన :- ఇలాబయటికి వెళ్ళితె మాకీళ్ళు విరగదీస్తారు.

వీర :- నాశాయశక్తులా ప్రయత్నించి–ప్రజలనుండి మీచావును తప్పించి-
పోలీసుల కప్పజెప్పే ఏర్పాటుచేస్తాను

విజ :- వద్దునాన్నా....వద్దు....వీళ్ళందరికోసం నువ్వా వెల్లువలోకి వెళ్ళకు

( వీరయ్య ఒక్క అడుగు ముందుకువేశాడు. భూపతిరావు
జేబులోనుండి పిస్టల్ బయటకు తీస్తాడు. )

భూప - వీరయ్యా ... ఆగు!

(వీరయ్య ఆగిపోతాడు. అందరూ ఒకక్షణం నిశ్చేష్టులవుతారు.)

వీర _: భూపతిరావు ఏమిటి?

భూప :- నీ మృత్యువు. నేనే నాశనమయ్యే సమయం వచ్చినప్పుడు....
నాతోపాటు మీరూవస్తారన్న సంగతి మర్చిపోకండి....ఈ గెడ్డపై
నాతో పోటీపడి బ్రతికి బయటపడినవాడులేడు. (చావు అని పిస్టల్
రెండుసార్లు పేలుస్తాడు వీరయ్య "అమ్మా" అనిపడిపోతాడు.)

విజ :- నాన్నా . . . ( అని ఏడుస్తూ వీరయ్యపై పడుతుంది )

రాజే :- (గట్టిగా) నాన్నా! మీరు హత్యచేసింది వీరయ్యనుకాదు . . .
నవసమాజ నిర్మాతను. చనిపోయింది వీరయ్య మాత్రమే—

వీరయ్యలోని సోషలిజం చావలేదు. ప్రజాశక్తిగా మారి ఉరకలు వేస్తూ ముందుకు వస్తుంది. దానిబారినుండి పారిపోవటంగాని— తప్పించుకోవటంగాని మీతరంకాదు. వీరయ్య ప్రతిరక్తపు బిందువునుండి సోషలిజపు బీజాలు ఉద్భవిస్తాయి మహావృక్షాలయి పాతుకుపోతాయి. వాటిబ్రేళ్ళ తాకిడికి మీరు నిలువునా కూలిపోతారు. రాబోయేకాలంలో మీకు తీర్పునిచ్చేది. శిక్షవిధించే దీప్రజలేనని మాత్రం మరువకండి. (బయట పోలీస్ విజిల్స్ వినబడతాయి.)

భూప :- అరుగో పోలీసులు వస్తున్నారు.... వీలయినంత త్వరగా మనం బయటపడాలి...పదండి .. (నలుగురూ ఒక్కఅడుగు దొడ్డివాకిలి వైపువేస్తారు బయటనుండి సబ్ఇనస్పెక్టరు వస్తాడు)

యస్. ఐ :- [జేబులోనుండి పిస్టల్ తీసి] పారిపోవటానికి ప్రయత్నిస్తే నా పిస్టల్‌గుండ్లు మిమ్మల్ని తాకవలసివస్తుంది. మర్యాదగా చేతులు పైకెత్తండి. [నలుగురూ చేతులు పైకెత్తుతారు]

యస్. ఐ :- మీరు ఎటూ పారిపోలేరు. ఈ ఇంటిచుట్టూ పోలీస్ కాపలా వుంది. ఎటువైపువెళ్ళినా మీ శరీరాలు తూటాల మయమవు తాయి. మిష్టర్ భూపతిరావు . . . . Give that pistal. (భూపతిరావు పిస్టల్ క్రిందపారవేస్తాడు)

యస్. ఐ :- (వీరయ్యనుచూసి టోపీతీసి రాజేష్‌తో) సారీ మిష్టర్ మిష్టర్ రాజేష్ చాలా దారుణం జరిగిపోయింది. శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కి పంపించే ఏర్పాటు చేస్తాను.

(రాజేష్ అక్కడవున్న తెల్లగుడ్డతెచ్చి వీరయ్యపై కప్పుతాడు అందరూ చేతులు పైకెత్తి నడుస్తూవుంటారు. తెరమెల్లిగా జారుతుంది.

స మా ప్తం.

BCi

BC
AOUA105B148

ప్రచురణ

శ్రీ ఆంధ్రరత్న బుక్ డిపో స్థాపకులు, శ్రీ సత్యసాయిబాబా భక్తవరేణ్యులు

శ్రీ గ్రంధి లక్ష్మయ్య శ్రేష్ఠిగారు



వరణీయమ్మయి "ఆంధ్రరత్న" విలయ వ్యాపార దశాంగమై
చిరసంభావితమై కళామధురమై శ్రీ సత్యసాయీశ్వర
స్థిరభక్తిప్రదమై మహోన్నతగుణ శ్రేష్ఠంకమౌ నీయశో
స్థితి మూహించెద "గ్రంధి లక్ష్మయ" మహాశ్రేష్ఠి విశిష్టాకృతీ

వి. వి. ఏ. ఆచార్య
"సాహిత్యరత్న"

V.R.NARLA
D.P.R.I.
Acc. No.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B148 |
| పుస్తకం పేరు | ఆరోయకాలంలో ఆరోయవాయువులు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 89 |
| పెద్ద సైజు పేజీలు | No |
| ఖాళీ పేజీలు | CI 13C( |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | [illegible] |
| పేజీలు విడదీసినది | vedavyas |
| స్కాన్ చేసినది | [illegible] |
| పరీక్ష చేసినది | SARANYA |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | Good |